17CTR1:17CTR1.qxd 11/16/2026 11:28 PM Page 1



సోమవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా రోజూ ఉత్సవాల సంబరాలు మిన్నుముట్టుతున్నాయి. కార్తీక మాసంలో సోమవారాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో రెండవ సోమవారం రాత్రి స్వామి అమ్మవార్ల సవారి ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసి గ్రామోత్సవానికి తరలించారు.ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసి ఆలయ చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ ఆలయ ఇఒ బికె వవెంకటేశులు హారతులిచ్చి ఉత్సవానికి తరలించారు.పల్లకిల్లో ప్రతిష్ఠించి గ్రామోత్సవానికి తరలించారు. ఉత్సవంతో పాటు ఆలయ ఇన్సెపెక్టర్ హరియాదవ్ దఫేదార్ వెంటరాగా కన్నుల పండువడా సాగింది.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
30 ఏళ్ళ ప్రస్థానం 30 వార్త వార్షికోత్సవం 1996 - 2026
వార్త

కాణిపాకంలో
వైభవంగా కార్తీక దీపారాధన

కాణిపాకం, నవంబర్ 16 ప్రభాతవార్త:



మణికంఠేశ్వరాలయంలో ఉసిరి చెట్టుకింద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం మొదటి సోమవారం కార్తీక దీపారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. కార్తీకమాసంలో ప్రతి సోమవారం శివాలయాలలో దీపాలను వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈమేరకు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరాలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకింద మహిళలు సోమవారం రోజున ఉదయం నుండి రాత్రి వరకు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాణిపాకం పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున దీపారాధన కోసం తరలిరావడంతో మణికంఠేశ్వరాలయం మహిళా భక్తుల రద్దీ నెలకొంది. ఇదిలా వుండగా ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

2వ విడత పంచాయతీ ఎన్నికల
నోటిఫికేషన్ విడుదల

చిత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాలో రెండవ విడత జరుగనున్న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు రిటర్నింగ్ అధికారులు బుధవారం రెండవ విడత పంచాయతీ ఎన్నికలు జరిగే మండలాలకు నోటీసులు జారీ చేయనున్నారు. చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మొత్తం 9 మండలాల్లోని 230 గ్రామ పంచాయతీలు, 2,098 వార్డులకు నవంబర్ 29వ తేదీ రెండవ విడతలో పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. ఈ ఎన్నికల కోసం 423 పోలింగ్ లోకేషన్ల పరిధిలో 2,098 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. 2వ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో 3,29,484 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. 2వ విడతలో బంగారుపాళ్యం(41 పంచాయతీలు), చిత్తూరు రూరల్(17 పంచా యతీలు), గుడిపాల(27 పంచాయతీలు), ఐరాల (28 పంచాయతీలు), పులిచెర్ల(23 పంచాయ తీలు), పూతలపట్టు(25 పంచాయతీలు), రొంపిచెర్ల(11 పంచాయతీలు), తవణంపల్లి (32 పంచాయతీలు), యాదమరి(26 పంచాయతీ)లకు ఎన్నికల పోలింగ్ జరుగనుంది. రెండవ విడత పంచా యతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేయగా, రిటర్నింగ్ అధికారి ఈ ఎన్నికలకు సంబంధించి బుధవారం నోటీసు విడుదల చేస్తారు. నామినేషన్ల దాఖలుకు నవంబర్ 20వ తేదీ చివరి రోజు కాగా, ఈ నెల 21న నామినేషన్ల పరిశీలన, 22వ తేదీ నామినేషన్లపై అప్పీళ్ళు, 23వ తేదీ నామినేషన్ల అప్పీళ్ళపై పరిష్కారం, 24వ తేదీ నామినేషన్ల ఉప సంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. ఆపై నవంబర్ 29వ తేదీ పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి అభ్యర్థుల ఫలితాలను వెల్లడిస్తారు.

పుష్పార్చనతో పులకించిన మలయప్పస్వామి

తిరుమల,నవంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:
పవిత్రమైన కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. సువాసనలు వెదజల్లే 16 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి వేదోక్తంగా పుష్పార్చన నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, పత్రాల మధ్య స్వామి, అమ్మవార్ల వైభవం మరింత ఇనుమడించింది. మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ పుష్పకైంకర్యం చేశారు.

-పరవశించిన సువాసనల పుష్పాలు:
చామంతి, సంపంగి, రోజా, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, మాను సంపంగి, ఇతర పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదిరిపచ్చ పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఈ సందర్భంగా వేదపండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదాలను పఠించారు.

-పుష్పాధిదేవుడు "పుల్లుడు" ఆవాహన
పుష్పాలకు అధిపతి అయిన దేవుడు పుల్లుడిని ఆవాహన చేసి 20 సార్లు వివిధ రకాల పుష్పాలతో అర్చించారు. ఉత్సవమూర్తుల నిలువెత్తు వరకు ఉండేలా పుష్ప నివేదన చేపట్టారు. పుష్పయాగానికి మొత్తం 9 టన్నుల పుష్పాలు, పత్రాలను దాతలు అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి పెద్దజీయర్,చిన్నజీయర్, టిటిడి ఈఒ, సాధికారిక మండలి చైర్మన్ ముద్దాడరవిచంద్ర, అదనపు ఈఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి దంపతులు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఒ బయ్యాల భాస్కర్, పేష్కార్ రామకృష్ణ, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒనీలిమ, ఏవిఎస్ఒ రాజశేఖర్ పాల్గొన్నారు.

పుష్పాధిదేవుడు "పుల్లుడు" ఆవాహన



తిరుపతి రూరల్‌లో పల్లెపోరు.. రసవత్తరంగా మారిన రాజకీయం!....

34 గ్రామ పంచాయతీలు.. 1.52 లక్షల మంది ఓటర్లు....
ఈ నెల 18 నుంచి 20 వరకు సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు
29న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు
గ్రామాల్లో అప్పుడే మొదలైన రాజకీయ సమీకరణాలు



తిరుపతి రూరల్ నవంబర్ 16 ప్రభాత వార్త:...

తిరుపతి రూరల్ మండలంలో పల్లె రాజకీయం వేడెక్కుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. మండల పరిధిలోని 34 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పీఠాలను దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, ఆశావహులు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నారు. స్థానికంగా పట్టున్న నాయకులు, గ్రామాల్లో బలమైన అనుచరగణం కలిగిన వ్యక్తులు అభ్యర్థులుగా బరిలో దిగేందుకు సిద్ధమవుతుండటంతో పల్లె పోరు రసవత్తరంగా మారుతోంది. మండల పరిధిలో మొత్తం 1,52,078 మంది ఓటర్లు ఉండటంతో ప్రతి గ్రామ పంచాయతీ ఎన్నిక రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారనుంది. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు సర్పంచ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. ఈ నెల 29వ తేదీన పోలింగ్ నిర్వహించనుండగా, అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. దీంతో నామినేషన్ల ఘట్టం నుంచే గ్రామాల్లో రాజకీయ వేడి పెరిగే అవకాశముంది. ఎన్నికల్లో తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పావులు కదుపుతున్నారు. గ్రామాల్లో అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, వ్యక్తిగత బలాబలాలు కీలకంగా మారనున్నాయి. ఏ గ్రామంలో ఎవరు బరిలో నిలుస్తారు? ఎవరికి ఏ పార్టీ మద్దతు లభిస్తుంది? చివరకు సర్పంచ్ పీఠాలు ఎవరిని వరిస్తాయి? అన్న ఉత్కంఠ నెలకొంది. మొత్తంగా 34 గ్రామ పంచాయతీల్లో జరగనున్న ఈ ఎన్నికలు తిరుపతి రూరల్ మండల రాజకీయ భవిష్యత్తుకు కీలకంగా మారనున్నాయి. నామినేషన్లతో మొదలుకానున్న ఈ పల్లె సమరం 29వ తేదీ ఫలితాలతో ముగియనుండటంతో గ్రామీణ రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరగనున్నాయి.


నామినేషన్లపై పోలీసుల డేగకన్ను!....



తిరుపతి రూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త:

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా నామినేషన్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు, నిరంతర పర్యవేక్షణ మధ్య తిరుపతి నియోజకవర్గంలో మొదటి విడత రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా కొనసాగింది. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ముందస్తు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షి స్తూ ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద తగినంత పోలీసు సిబ్బందిని మోహరించి, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల కదలికలను పర్యవేక్షి స్తూ ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపైనా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే చర్యలు, శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలను ఎప్పటికప్పుడు గుర్తించి అడ్డుకునేలా సిబ్బందిని అప్రమత్తం చేసింది. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా ఏర్పాట్లను కొనసాగిస్తోంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేసినా, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా ఉపేక్షి ంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అటువంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి అప్రమత్తతతో పనిచేస్తోందని తెలిపారు.

వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరునికి కల్యాణం



వడమాలపేట, నవంబరు 16 ప్రభాతవార్త:

శ్రవణా నక్షత్ర శుభదినాన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి కల్యాణం అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 11 గంటలకు శ్రీవారు, ఉభయదేవేరుల ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. అర్చకులు తిప్పయాచార్యులు అగ్నిహోమం, వేదమంత్రాలు భక్తుల గోవింద నామస్మరణల నడుమ టీటీడీ లాంఛనాలతోస్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామివారు శ్రీదేవి, భూదేవి మెడలో మంగళ సూత్రధారణ చేశారు. కల్యాణోత్సవం టికెట్లు తీసుకున్న దంపతులు స్వామివారి కల్యాణాన్ని తనివితీరా తిలకించి పులకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ చైర్మెన్ కుర్చి ఎవరికో?

-పవార్ పాలనలో మునిసిపాలిటికి సమకూరిన ఆస్తులు



రామచంద్ర



జయరామారావు



మాధవరావు



శాంతారాంజెపవార్



తీగల చంద్రశేఖర్



మ్యాగీ క్లారా



డాక్టర్ అన్నపూర్ణ



పేట రాధారెడ్డి



ముత్యాల పార్థసారథి

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మున్సిపాలిటి 10వ చైర్మెన్ కుర్చి ఎవరికి దక్కుంతుందో అనే చర్చ, ఉత్కంఠత చోటు చేసుకుంది. 1956లో మేజర్ పంచాయతీ నుంచి మూడవ శ్రేణి మున్సిపాలిటి అయ్యింది. అప్పటి నుంచి సుమారు 40 సంవత్సరాల పాటు మునిన్సిపల్ పాలన 'పవార్' కుటుంబపాలనలో సాగింది.శ్రీకాళహస్తిలో వైట్‌హౌస్ అని పిలవబడే పవార్ కుటుంబంలోని మూడు తరాలు మున్సిపాలిటిని పరిపాలించారు. వారి హయాంలో మున్సిపాలిటికి ఆస్తుల్ని సమకూర్చారు. నేడు కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తుల్ని వారి పరిపాలనలో సమకూర్చారు.

పవార్ కుటుంబ పాలనలో 40సంవత్సరాలు:
శ్రీకాళహస్తి మునిన్సిపాలిటిని 40 సంవత్సరాల పాటు మూడు తరాలు తిరుగులేని విధంగా పవార్ కుటుంబం పరిపాలించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న శ్రీకాళహస్తి మున్సిపాలిటి మాత్రం ఆ కుటుంబం కనుసన్నల్లోనే సాగింది. 1956 మూడవ శ్రేణి మున్సిపాలిటి అయిన శ్రీకాళహస్తికి అప్పటి వరకు పివి రామచంద్రారావు పవర్ పరిపాలిస్తున్నారు.ఆయన హయాంలో మున్సిపాలిటికి ప్రస్తుతం జబారు వీధిలోని కొండమిట్ట మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉన్న భవనం స్థలాన్ని సేకరించి కొనుగోలు చేసారు. 2014 వరకు ఈభవనం సైరన్ బిల్డింగ్‌గా కొనసాగింది. తరువాత 1962లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన తనయుడు జయరారామావు పవార్ చైర్మెన్ కుర్చిని అధిష్టించారు. ఆయన హయాంలో సుపరిపాలనతో పాటు మున్సిపాలిటికి పానగల్‌లోని సుమారు 5 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసారు. నేడు ఇక్కడ ఎన్‌టిఆర్ పార్కుతో పాటు ఎంపిడిఒ కార్యాలయం పక్కన ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసారు. ఆయన పదవిలో ఉండగానే గుండెపోటుతో 1964లో మృతి చెందారు. తరువాత 1967లో జరిగిన ఎన్నికల్లో పవార్ కుటుంబం నుంచి పివి మాధవరావు చైర్మెన్ అయ్యారు. ఆయన వృత్తి రీత్యా న్యాయవాది, ఆయన పరిపాలనలో నేడు మున్సిపల్ పరిపాలనా భవనాలు, అలాగే పక్కనే ఉన్న కమిషనర్ కార్వర్టర్స్ భవనాల స్థలాన్ని కొనుగోలు చేసారు. 1972 నుంచి 11 సంవత్సరాల పాటు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగలేదు. అంజయ్య ముఖ్యమంత్రిగా 1982లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పవార్ కుటుంబం నుంచి శాంతారాంజెపవార్‌ను పరిపాలనకు పంపారు. ఇలా సుమారు 40 సంవత్సరాల పాటు పవార్ కుటుంబంబం పరిపాలనా రంగంలో కొనసాగారు.

మున్సిపాలిటిని పరిపాలించిన చైర్మెన్లు వీరే:
శ్రీకాళహస్తి మున్సి పాలిటిని పవార్ కుటుంబం కాకుండా పరిపాలించిన చైర్మెన్ వివరాలు ఇలా ఉన్నాయి. 1983లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 1987లో జరిగిన మున్సిపల్ ప్రత్యక్ష ఎన్నికల్లో ఆర్‌టిసిలో కండక్టర్‌గా పని చేస్తున్న తీగల చంద్రశేఖర్‌ను తెలుగుదేశం పార్టీ నియమించింది. ఈ మున్సిపాలిటిని రిజర్వేషన్లలో గిరిజనులకు కేటాయించారు. చైర్మెన్ గిరిజనులకు కేటాయించగా రెండు ప్రధాన సామాజిక వర్గాలు వైస్ చైర్మెన్లుగా కొనసాగారు. తరువాత 2000 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన మ్యాగీ క్లారా మున్సిపల్ చైర్మెన్ అయ్యారు. తరువాత 2005లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ జిఎల్ అన్నపూర్ణను అప్పటి శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు గెలిపించుకున్నారు. తరువాత 2014 వరకు ఎన్నికలు జరగలేదు. తరువాత జరిగిన ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరిగింది. ఈ ఏడాది శ్రీకాళహస్తి మున్సిపాలిటిని అన్‌రిజర్వ్‌డ్ చేయగా అప్పటి శాసనసభ్యుడు, మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఈ సీటుపై బిసిలపై తనకున్న ప్రేమాభిమానాలను చాటుకుంటూ బిసి వర్గానికి చెందిన పేట రాధారెడ్డిని గెలిపించుకున్నారు. రెండున్నర సంవత్సరాల తరువాత ఆయన ఆనారోగ్యంతో మృతిచెందగా ఆ సీటును శ్రీకాళహస్తిలోని ప్రధాన సామాజిక వర్గం నుంచి ముత్యాల పార్థసారధికి అవకాశం కల్పించారు. 2020 జరగాల్సిన మున్సిపల్ ఎన్నికలు వైకాపా అనాలోచితంగా చేపట్టిన డీలిమిటేషన్ ప్రక్రియపై కోర్టుకు వెళ్ళటంతో ఎన్నికలు జరగలేదు. ప్రస్తుతం మళ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మరి ఈసారి చైర్మెన్ పదవికి ఎన్నికలు జరుగుతాయో లేక ఏకగ్రీవం అవుంతుందో తెలియదు కానీ ఓటరన్న తీర్పు పరిపాలనపై తీర్పుగా భావించాల్సి ఉంటుంది.

సంప్రదాయ వ్యవసాయ విజ్ఞానం ప్రజలకు చేరాలి

-కేంద్ర హిందీ సంచాలక్ డైరెక్టర్ హితేంద్రకుమార్ మిశ్రా



కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

సంప్రదాయ వ్యవసాయ విజ్ఞానం, ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానాన్ని భారతీయ భాషల ద్వారా సామాన్య ప్రజలకు చేరవేయాల్సిన అవసరం ఉందని కేంద్ర హిందీ సంచాలక్ డైరెక్టర్ హితేంద్రకుమార్ మిశ్రా పేర్కొన్నారు. సోమవారం ద్రవిడ వర్సిటీలో ఏకరూప శాస్త్రీయ వ్యవసాయ పరిభాష అనే అంశంపై ఐదు రోజుల జాతీయ సదస్సు మొదలైంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రవిడ వర్సిటీ ఇలాంటి సదస్సుల ద్వారా ప్రశంసనీయమైన కృషి చేస్తోందన్నారు. ఇది ఓ విశిష్టమైన తొలి ప్రయత్నం అన్నారు. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం కేవలం ఆంగ్లభాషకే పరిమితం కాకుండా దేశంలోని వివిధ భాషల్లో అందుబాటులో తేవాలని ఆకాంక్షించారు. తిరుపతి ఎస్వీయు ఉపకులపతి ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, ప్రత్యేకతలను వివరించారు. వివిధ భాషల్లోకి శాస్త్రీయ విజ్ఞానం బదిలీ చేయడంతో కలిగే అవకాశాల గురించి వివరించారు. ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.సి. మల్లయ్య మాట్లాడుతూ భాష, సాహిత్యం, సంస్కృతి, జ్ఞానసంప్రదాయాల అభివృద్ధికి ద్రవిడ వర్సిటీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, హెచ్ఒడి దుర్గా ప్రవీణ్; స్కూల్ డీన్ ఆచార్య శ్రీదేవి, కోఆర్డినేటర్ ఆచార్య శారద పాల్గొన్నారు.

17 CTR 2:17 CTR 2.qxd 11/16/2026 11:18 PM Page 1

పొరబాట్లు లేకుండా జనగణన సమాచార సేకరణ



- శిక్షణ పొందిన అంశాలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలుకు చర్యలు
- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

చిత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో ఎలాంటి తప్పులు, పొరబాట్లు లేకుండా జనగణన సమాచారాన్ని పక్కాగా సేకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. భారత జనాభా గణన-2027 కార్యక్రమంలో భాగంగా సోమవారం రెండవ విడత జనాభా గణన నిర్వహణపై ఫీల్డ్ ట్రైనర్లకు కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో జిల్లా అధికారులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమంను డిఆర్ఓ మోహన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన శిక్షణలో డిఆర్ఓ మాట్లాడుతూ జనగణన నిర్వహణపై మూడు రోజుల పాటు జరిగే శిక్షణను అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో వివరించే ప్రతి అంశంను శ్రద్ధగా విని, ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలు వున్నా సత్వరం మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయ్యే సమయానికి ప్రతి ఒక్కరికీ జనభా గణన ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి వుండాలన్నారు. జనాభా లెక్కింపు ద్వారా సేకరించే గణాంకాలు, దేశ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కావున జనాభా సమాచార సేకరణలో కచ్చితత్వం, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జనాభా లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధి విధానాలు క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, సాంకేతిక అంశాలపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన కలిగి వుండాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, సాంకేతిక పరిజ్ఞానంను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సమాచార సేకరణలో ఎదురయ్యే సందేహాలను సత్వరం నివృత్తి చేసుకుని నిర్దేశిత పద్ధతులను కచ్చితంగా పాటించాలన్నారు. డిసెంబర్ నెలలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిఓణ కార్యక్రమాలు ప్రారంభించి, నెలాఖరులోపు శిక్షణ పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ఫీల్డ్ ట్రైనర్లు ఇప్పటి నుండి సిద్ధమై, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనగణనకు సంబంధించిన మాస్టర్ ట్రైనర్లు, ఫీల్డ్ ట్రైనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు

బంగారుపాళ్యం, నవంబర్ 16 ప్రభాతవార్త:

మండల పరిధిలోని 41 గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు అధికారులు సన్నాహాలు ముమ్మరం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించడంతో మండల స్థాయి అధికారులు ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 18వ తేదీ నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో 41 పంచాయతీలకు 8 నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి పురుషోత్తం తెలిపారు. రాగిమానుపెంట నామినేషన్ కేంద్రంలో కీరమంద, కెఎం కండ్రిగ, పొదలమడుగు, రాగిమానుపెంట, వెలుతురుచేను, జిల్లేడిపల్లి నామినేషన్ కేంద్రంలో మంగళపల్లి, తంబుగానిపల్లి, జిల్లేడుపల్లి, చీకూరుపల్లి, గుండ్లకట్టమంచి, సంక్రాంతిపల్లి నామినేషన్ కేంద్రంలో మహాసముద్రం, సంక్రాంతిపల్లి, కుర్మాయిపల్లి, చిల్లగుండ్లపల్లి, కల్లూరుపల్లి, 45 గొల్లపల్లి నామినేషన్ కేంద్రంలో కాటప్పగారిపల్లి, బోడబండ్ల, గుంతూరు, గొల్లపల్లి, బంగారుపాళ్యం నామినేషన్ కేంద్రంలో బంగారుపాళ్యం, తగ్గువారిపల్లి, పాలేరు, జంబువారిపల్లి, ముంగరమడుగు, తిమ్మోజిపల్లి, మొగిలి నామినేషన్ కేంద్రంలో టేకుమంద, మొగిలి, మొగిలివారిపల్లి, మొగిలి వెంకటగిరి, జయంతి, నలగాంపల్లి నామినేషన్ కేంద్రంలో నలగాంపల్లి, నల్లంగాడు, కరిడువారిపల్లి, సదకుప్పం, బొంబాయిపల్లి, తుంబకుప్పం నామినేషన్ కేంద్రంలో తుంపాయినిపల్లి, తుంబకుప్పం, తుంబ, పెరుమాళ్ళపల్లి, ఈచినేరుపల్లి, శెట్టిరి గ్రామ పంచాయతీలు వున్నట్లు మండల ఎన్నికల అధికారి వివరించారు. ఈ కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరణ వుంటుందని వివరాలకు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఎంపిడిఒచే నామినేషన్ కేంద్రాల పరిశీలన



కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

మ ండలంలోని నడిమూరు, కెడిపల్లి, చెక్కునత్తం, మల్లానూరు, అడవిబూదుగూరు, కంగుంది గ్రామాల్లోని స్వర్ణ భవనాల్లోని నామినేషన్ కేంద్రాలను సోమవార ం ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ నామినేషన్ కేంద్రంకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సాయంత్రం5గంటలవరకు నామినేషన్లను స్వీకరించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరబాట్లకు తావివ్వరాదని ఆదేశించారు.

మెప్మా అధ్వర్యంలో బ్యూటీ పార్లర్ ప్రారంభం



కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటికో పారి శ్రామికవేత్త కార్యక్రమంలో భాగంగా మెప్మా అధ్వర్యంలో కుప్పం పట్టణంకు చెందిన శ్రావణి అనే మహిళకు బ్యూటీ పార్లర్ ఏర్పాటుచేశారు. దీన్ని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్, కమీషనర్ శ్రీనివాసరావు, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ ప్రారంభించారు. బ్యూటిట్వా ఫ్రాంఛైజీతో మెప్మా కుదుర్చుకున్న 10.25లక్షల ఒప్పందం మేరకు ఈబ్యూటీ పార్లర్‌ను ఏర్పాటుచేశారు.మెప్మా జీవనోపాధుల అధికారి రవి, జిల్లా సంస్థాగత నిర్మాణాధికారి శ్రీరాములు, జిల్లా బ్యాంక్ లింకేజ్ అధికారి జయంతి, మెప్మా సిఎంఎం మనోహర్, సిఒ శోభ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు నీటిశుద్ధియంత్రం వితరణ



కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి వడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు స్కైబర్ డైనమిక్స్ సంస్థ, కుప్పం లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో నీటి శుద్ధి యంత్రాన్ని వితరణగా అందించారు. విద్యార్థులకు శుద్ధ తాగునీరు అందించేందుకు తమవ ంతు సహకారం అందించినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో స ంస్థ హెచ్ఆర్ వినూత, విజయకుమార్, హెచ్ఎం మురళి, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, అధ్యక్షుడు పిజి సెల్వం, జయరాంనాయుడు, కౌన్సిలర్లు రాజేష్, కమలేష్, ఎస్ఎంసి ఛైర్మన్ నటరాజ్, సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడుపల్లెలో 168 నామినేషన్లు

గుడుపల్లె, నవంబర్ 16 ప్రభాతవార్త

మండలంలోని 18 పంచాయతీలకు సంబంధించి రెండోరోజు 168 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్ప ంచ్ స్థానానికి 72, వార్డు స్థానాలకు 96 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం రెండు రోజుల్లో సర్పంచ్‌కు 92, వార్డు సభ్యులకు 99 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపిడిఒ తెలిపారు.

శాంతిపురంలో 269 నామినేషన్లు

శాంతిపురం, నవంబర్ 16 ప్రభాతవార్త

మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి రెండోరోజు 269 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపిడిఒ ఎపిఆర్ కుమార్ తెలిపారు. సర్పంచ్‌స్థానాలకు 81, వార్డు స్థానాలకు 188 నామినేషన్లు వేశారు.మొత్తంరెండురోజుల్లోసర్పంచులకు107, వార్డుస్థానాలకు 211 నామినేషను ల్ దాఖలైనట్లు తెలిపారు.

కుప్పంలో రెండోరోజు 342 నామినేషన్లు

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

కుప్పం మండలంలోని 29 గ్రామ ప ంచాయతీలకు సంబంధించి రెండోరోజు 342 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపిడిఒ రాజేం ద్రప్రసాద్ తెలిపారు. సోమవారం సర్పంచ్‌లకు 92మంది, వార్డు స్థానాలకు 250మంది నామినేషన్లు దాఖలు చేశారు. రెండు రోజుల్లో సర్పంచ్‌లకు 133మంది, వార్డు సభ్యులకు 304మంది నామినేషన్లు సమరి ్పంచినట్లు ఆయన చెప్పారు. మంగళవారం సాయంత్రం 5గంటలతో

శేఖర్ రెడ్డి మృతికి ఎమ్మెల్యే సంతాపం



పలమనేరు రూరల్, నవంబర్ 16, ప్రభాతవార్త

పలమనేరు మున్సిపల్ పరిధిలోని టిఎస్ అగ్రహారం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు శేఖర్ రెడ్డి మృతికి స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డితో పాటు నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు. గత కొంతకాలంగా శ్వాసకొస సమస్యతో బాధపడుతున్న శేఖర్ రెడ్డి సోమవారం మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్టణ టీడీపీ నాయకులతో కలసి వెళ్లి శేఖర్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం వారి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఈ సంతాప కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం గౌడ్, క్రిష్ణ మూర్తి గౌడ్, సుదీర్ కుమార్, నాగరాజు, చంద్రా రెడ్డి, రూపేష్, కృష్ణ రెడ్డి, రెడ్డెప్ప తదితరులు ఉన్నారు.

డ్రోన్ల సహాయంతో మరింత పట్టిష్టత

- మొదటి విడత పలమనేరు, కుప్పం జరుగుతున్న స్థానికల ఎన్నికలు దృష్ట్యా ఎగురుతున్న డ్రోన్లు



పలమనేరు రూరల్, నవంబర్ 16, ప్రభాతవార్త

మొదటి విడత జరుగుతున్న పలమనేరు కుప్పం డివిజన్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా డ్రోన్ టెక్నాలజీతో విస్తృత నిఘా - ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు, గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తూ విస్తృత నిఘా ఏర్పాటు చేశారు.నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రదేశాలు, సమస్యాత్మక ప్రాంతాలపై డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలిగించరాదని జిల్లా పోలీసులు సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించి గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

కీరమంద విద్యార్థులకు బంగారు పతకాలు



బంగారుపాళ్యం, నవంబర్ 16 ప్రభాతవార్త:

మండల పరిధిలోని కీరమంద జడ్పీ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థినిలు బంగారు పతకాలు సాధించారు. పాఠశాల నందు 10వ తరగతి చదువుతున్న యువశ్రీ, 9వ తరగతి చదువుతున్న యస్వితలు రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. 45వ రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో పోటీలు కృష్ణా జిల్లా గుడివాడ నందు జరిగాయి. ఈ పోటీల్లో ఈ విద్యార్థినిలు చిత్తూరు జిల్లా జట్టు తరపున ఆడి విశేష ఆట ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో విజయం సాధించి బంగారు పతకాలు సాధించింది. జిల్లా జట్టులో విశేష ఆట ప్రతిభను కనబరచిన యువశ్రీ, యస్వితలకు బంగారు పతకాలు, మెమోంటోలను అందజేశారు. సోమవారం పాఠశాల నందు ఆ విద్యార్థినిలకు హెడ్మాస్టర్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు షంషీర్‌ఖాన్, పట్టాభిలు ఘనంగా సన్మానించారు. పిఇటి దేవేంద్రను అభినందించారు.

గొడుగు చింత పంచాయతీలో సర్పంచ్ పదవికి ఆరుగురు ఆశావహులు

- ఎవరికి అవకాశం దక్కుతుందోనని గ్రామంలో ఆసక్తికర చర్చలు

పుతలపట్టు, నవంబర్ 16, ప్రభాతవార్త

గొడుగు చింత పంచాయతీలో సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ఆరుగురు ఆశావహులు ఆసక్తి చూపుతున్నట్లు గ్రామంలో చర్చ సాగుతోంది. సర్పంచ్ అభ్యర్థిత్వం కోసం పలువురు నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో పంచాయతీ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం దక్కించుకోవాలని ఆశిస్తున్న నాయకులు తమ తమ అనుచరులతో చర్చలు జరుపుతూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆరుగురు ఆశావహులు ఉండటంతో ఎవరికి అవకాశం లభిస్తుంది? పార్టీ పెద్దలు ఎవరికి మద్దతు ప్రకటిస్తారు? అనే అంశాలపై గ్రామ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు అభ్యర్థి ఎంపిక విషయంలో నాయకులు ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. చివరకు ఎవరికి అవకాశం దక్కుతుందో వేచి చూడాల్సిందే. గొడుగు చింత పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎంపికపై గ్రామ రాజకీయాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, నవంబర్ 16 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు సోమవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు ఐరాల మండలం మోటకంపల్లెకు చెందిన రామచంద్రశెట్టి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తా న్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ పాలకమండలి సభ్యుడు సుబ్బారెడ్డి,సూపరెండెంట్ వాసులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్ పెక్టర్ రవి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ ఎంపిక పోటీలు



చిత్తూరురూరల్, నవంబరు 16 ప్రభాతవార్త:

చిత్తూరు మెసానికల్ క్రీడామైదానంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ భాస్కర్ తెలిపారు.పారా అథ్లెటిక్స్ బ్యాడ్మింటన్, వీల్‌చైర్, ఫెన్సింగ్, బ్లైండ్ గోల్‌బాల్, పారా తైక్వాండో, టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలకు బాలురు, పురుషులు (27) బాలికలు, మహిళలు (15) మొత్తం 42మంది దివ్యాంగ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 30నుంచి డిసెంబర్ 2తేది వరకు రాష్ట్ర, జాతీయ స్థాయి ఎంపికపోటీలు నిర్వహిస్తున్నట్లు ఉదయభాస్కర్ తెలిపారు.

ఘనంగా వినాయక స్వామి మహా కుంభాభిషేక మహోత్సవం

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు రూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త:

గంగవరం మండలంలోని కల్లుపల్లి పంచాయతీ మిట్టూరు గ్రామ శ్రీ వర సిద్ధి వినాయక స్వామి దేవస్థాన మహాకుంభాభిషేక మహోత్స వ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో కలశారాధనం, నిత్య హోమం, ప్రాణ ప్రతిష్ట హోమాలు, కలశ ఉధ్వసన జరిగాయి. అనంతరం జరిగిన ప్రాణ ప్రతిష్ట మహా కుంభాభిషేక సంప్రోక్షణ, మహా మంగళహారతి పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అ స్వామి వారిని వేడుకు న్నట్లు ఆయన పేర్కొన్నారు. తదనంతరం ఆలయ అర్చకులు వేదశీర్వచనం అందించి ఆశీర్వధించగా, ఉత్స వ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆయన్ను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, సోమశేఖర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, రామ్మోహన్, సతీష్, భరత్, సురేష్,సుబ్బా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలువు తీరనున్న కొత్త పాలకవర్గం

- సభ్యులకు దిశ నిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

పలమనేరు రూరల్, నవంబర్ 16, ప్రభాతవార్త:



నవంబర్ 23న జరగనున్న పలమనేరు మున్సిపాలిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన రాజ్యలక్ష్మి కృష్ణమూర్తి, కూటమి పార్టీల కౌన్సిలర్ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. పలమనేరు మున్సిపాలిటీ చరిత్రలో తొలిసారిగా తెలుగుదేశం పార్టీ మున్సిపల్ పీఠాన్ని అధిష్ఠించనున్న నేపథ్యంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా 23వ తేదీన చేపట్టనున్న ర్యాలీ, నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం, బహిరంగ సభ, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలకు భోజన ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు, పాలకవర్గ సభ్యులకు సూచించారు. సమన్వయంతో పనిచేస్తూ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్ వర్మ, డీఈ సురేష్, నాయకులు ఆర్వీ బాలాజీ, మార్క్(జీవరత్నం), చాంద్ భాషా, సుధీర్ కుమార్, రూపేష్, బీఆర్సీ కుమార్, నదీం, సురేష్, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

17CTR 3:17CTR 3.qxd 11/16/2026 11:32 PM Page 1

రెండో రోజు ఏకంగా 2300 నామినేషన్లు

- కుప్పం,పలమనేరులో నామినేషన్ల జాతర !!
- సర్పంచ్ స్థానాలకు 611.. వార్డు స్థానాలకు 1689 నామినేషన్లు !!

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి నామినేషన్ల దాఖలు జాతరను తలపించింది.రా త్రి 8గంటల వరకు అందిన సమాచారం మేరకు రెండో రోజు దాదాపు 2300 నామినేషన్లు దాఖలు కావడం విశేష ం. ఇందులో సర్పంచ్ స్థానాలకు 611 మంది, వార్డు స్థానాలకు 1689 మంది నామినేషన్లు సమర్పించారు. కాగా రెండు రోజులుగా సర్పంచ్‌లకు 787 నామినేషన్లు, వార్డు స్థానాలకు 1912నామినేషన్లు దాఖలు కావడం జరిగిందని అధికార వర్గాలు తెలి పాయి. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 92 పంచాయతీలకు, పలమనేరు నియో జకవర్గంలోని ఐదు మండలాల్లో 90 పంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నా యి. కాగా మంగళవారం సాయంత్రం 5గంటలతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుంది.



ఇదిలా ఉండగాకుప్పం నియోజకవర్గంలో పలు ప్రధాన పంచాయతీల్లో అధికార పార్టీ నేతల మద్దతుతో సర్పంచ్ అభ్యర్థులుగా నిలుస్తున్న వారు ర్యాలీలుగా వచ్చి నామినేషన్లు దాఖలు చేయడం కన్పించింది.

క్రిస్మస్ సందేశం.. జీవితానికి దిశానిర్దేశం

లక్ష ్యం వైపు నీతి, నిజాయితీతో సాగాలి
దైవ సేవకులకు కొత్త బట్టల పంపిణీ

తిరుపతి విద్య, నవంబర్ 16 ప్రభాతవార్త



జీవితంలో విజయం సాధించడమే కాదు.. ఆ విజయాన్ని ఏ మార్గంలో అందుకున్నామన్నది కూడా ముఖ్యమని ఎలమంచిలి ప్రవీణ్ పేర్కొన్నారు. ఇతరులతో పోటీపడే క్రమంలో నీతి, న్యాయం, నిజాయితీలను పక్కనపెట్టకూడదని, మంచి లక్ష ్యంతో చేసే ప్రయత్నమే మనిషికి నిజమైన గౌరవాన్ని తెచ్చిపెడుతుందని అన్నారు.తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వీజీపురంలోని హోరేబు మినిస్ట్రీస్‌లో సోమవారం పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. రూరల్ వి. నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను ఎలమంచిలి ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బైబిల్‌లోని పరుగుపందెం ప్రస్తావనను వివరిస్తూ.. పరుగెత్తే వారందరూ బహుమతి పొందాలనే లక్ష ్యంతో పరిగెత్తినట్లే, ప్రతి ఒక్కరూ జీవితంలో గమ్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. పోటీలో గెలుపు ఒక్కరికే దక్కినా, జీవితంలో మంచి మార్గాన్ని ఎంచుకుని విలువలతో జీవించే అవకాశం అందరికీ ఉంటుందని వివరించారు.సమాజంలో వ్యక్తుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలని, అది ఇతరులను కించపరిచేలా కాకుండా మనలోని ప్రతిభను వెలికితీసేలా ఉండాలని అన్నారు. క్రీస్తు బోధించిన ప్రేమ, క్షమాగుణం, సేవాభావం ప్రతి ఒక్కరి ప్రవర్తనలో కనిపిం చాలని, పండుగల సందేశం ఆచరణలో ప్రతిబింబించినప్పుడే వాటికి సార్థకత లభిస్తుందని పేర్కొన్నా రు.అనంతరం క్రిస్మస్‌ను పురస్కరించుకుని దైవ సేవకులకు నూతన బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ ఆనంద ప్రసాద్, కార్యదర్శి జె. పీటర్ పాల్, కోశాధికారి దానియేలు, ఉపాధ్యక్షులు ఈనేష్ బాబు, వి. దానమ్మ, బాలరాజు, జాన్ ప్రతాప్ తది తరులు పాల్గొన్నారు.క్రిస్మస్‌సేవాకోణాన్నిముందుకుతేవాలిప్రారంభాన్ని మరింత వార్తా పదునుతో మార్చాలి

డిగ్రీలతో పాటు జీవితంలో నిలబడే సత్తా కావాలి

విద్యార్థులకు రెండో సిలబస్‌పై వినయ్ మహేశ్వరి సూచన



తిరుపతి విద్య, నవంబర్ 16 ప్రభాతవార్త

తిరుపతి విద్యా కేంద్రంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విశ్వ విద్యాలయాల బాధ్యత కేవలం డిగ్రీలు అందించడంతో పూర్తికాదని, విద్యార్థులను జీవిత సవాళ్లకు సిద్ధం చేయడం కూడా అంతే ముఖ్యమని మోహన్ బాబు యూనివర్సిటీ ట్రస్టీ వినయ్ మహేశ్వరి అభిప్రాయపడ్డారు. పుస్తకాల్లోని పాఠాలతో పాటు జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను అధిగమించే నైపుణ్యాలను నేర్పే రెండో సిలబస్‌కు ఉన్నత విద్యాసంస్థలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విశ్వవిద్యాలయ సిలబస్ విద్యార్థులకు సబ్జెక్టు పరిజ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలను అందిస్తే.. రెండో సిలబస్ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందని వివరించారు. ఒత్తిడిని ఎదుర్కోవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం, ఇతరులతో కలిసి పనిచేయడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వంటి అంశాలు విద్యార్థుల ఎదుగుదలలో కీలకమన్నారు.తిరుపతి వంటి విద్యాకేంద్రాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు కొత్త వాతావరణంలో తమకంటూ ఒక గుర్తింపు, ఆత్మీయతను ఏర్పరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్యాంపస్‌లో స్నేహపూర్వక వాతావరణం, అధ్యాపకుల మార్గదర్శకత్వం, మెంటార్ల సహకారం అందితే విద్యార్థుల్లో ఒంటరితనం తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన జాతీయ స్థాయి అధ్యయనంలో 34 శాతం మంది క్యాంపస్‌లో తాము కొంతవరకు ఒంటరిగా ఉన్నట్లు భావించిన విష యాన్ని ప్రస్తావించారు.క్రీడలు, వ్యాయామం, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థి సంఘాల కార్య కలాపాలు కూడా చదువులో భాగమేనని తెలిపారు. ఇలాంటి అనుభవాలు నాయకత్వ లక్షణాలు, నిర్ణయ సామర్థం, బృంద స్ఫూర్తిని పెంపొందిస్తాయని వివరించారు. కేవలం ఉద్యోగం సంపాదించే పట్ట భద్రు లను కాకుండా, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎదుగుతూ సమాజానికి ఉపయోగపడే వ్యక్తు లను తయారు చేయడమే విశ్వవిద్యాలయాల అసలైన లక్ష ్యం కావాలని వినయ్ మహేశ్వరి పేర్కొన్నారు

రేణిగుంట మండలంలో 394 నామినేషన్లు

సర్పంచ్ స్థానాలకు 116.. వార్డు సభ్యుల స్థానాలకు 278 దాఖలు



రేణిగుంట, నవంబర్ 16, ప్రభాతవార్త:
రేణిగుంట మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మొత్తం 394 నామినేషన్లు దాఖలైనట్లు డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు వెల్లడించారు. మండలంలోని 19 గ్రామ పంచాయ తీల పరిధిలో సర్పంచ్ స్థానాలకు 116, వార్డు సభ్యుల స్థానాలకు 27 8 నామినేషన్లు నమోదైనట్లు తెలి పారు. పంచాయతీల వారీగా నామి నేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. సర్పంచ్ స్థా నాలకు అత్తూరులో 3, ఎలమండ్యంలో 10, గాజులమండ్యంలో 6, గురవరాజుపల్లెలో 5, గుత్తివారిపల్లెలో 9, వెదళ్లచెరువులో 3, జీపాలెంలో 12, కరకంబాడిలో 15, కృష్ణాపురంలో 8, శ్రీనివాస ఉదాసీపురంలో 5, మామం దూరులో 4, ఆర్.మల్లవరం 4, రేణిగుంటలో 4, సురప్పకాసంలో 3, తూకివాకంలో 8, కొత్ర మంగళం లో 3, వెంకటాపురంలో 9, తండ్లంలో 4, విప్పమనుపట్టెడలో ఒక నామినేషన్ దాఖలైంది. వార్డు సభ్యుల స్థానాలకు అత్తూరులో 1, ఎలమండ్యంలో 18, గాజుల మండ్యంలో 28, గురవరాజుపల్లెలో 15, గుత్తివారిపల్లెలో 0, వెదళ్లచెరువులో 6, జీపాలెంలో 12, కర కంబాడిలో 36, కృష్ణాపురంలో 19, శ్రీనివాస ఉదాశి పురంలో 5, మామండూరులో 17, ఆర్.మల్ల వరంలో 7,రేణిగుంటలో49,సురప్పకాసంలో8,తూకివాకంలో27,కొత్ర మంగళంలో 7, వెంకటా పురంలో 15, తండ్లంలో సున్నా, విప్పమనుపట్టెడలో 8 నామినేషన్లు నమోదయ్యాయి. మొత్తంగా సర్పంచ్ స్థానా లకు 116, వార్డు సభ్యుల స్థానాలకు 278 కలిపి 394 నామినేషన్లు దాఖలై నట్లుఉపఎంపీడీవో ప్రభు రావు

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ



విజయపురం, నవంబరు 16 ప్రభాతవార్త:
మండల పరిధిలో నవంబరు 29న జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను అందించే కేంద్రాలను సోమవారం నగరి డీఎస్పీ చంద్రశేఖర్ పరిశీలించారు. మండలంలో నామినేషన్స్ వేసే అభ్యర్థులు నిర్భయంగా వేసేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటామని వివరించారు. డీఎస్పీతో పాటు సీఐ భాస్కర్, ఎస్ఐ వెంకట సుబ్బయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మధ్యలో మానేసిన వారికి చదువు కొనసాగించేందుకు అవకాశం



విజయపురం, నవంబరు 16 ప్రభాతవార్త:
కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేక మధ్యలో మానేసిన వారికి చదువు కొనసాగించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని పన్నూరు జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన వారు చదవడానికి, రాయడానికి వచ్చిన వారు పదో తరగతి ప్రవేశానికి, పదో తరగతి పాసైన వారు ఇంటర్ మీడియట్‌కు అర్హులన్నారు. అంతకు ముందు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూలు చైర్మన్ మహేంద్రన్, పాఠశాల హైస్కూలు హెచ్ఎం మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు



చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రంను పురస్కరించుకుని శ్రీనివాసుడు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్స్ రాజ్‌కుమార్, హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటా పోటీగా ఇరుపార్టీల నామినేషన్లు..





రైల్వే కోడూరు, నవంబర్ 16 వభాతవార్త రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలోని పంచాయతీ ఎన్నికల పోరు ఇరు పార్టీలైన కూటమి, వైసీపీ పార్టీలు మద్దతు తెలిపే సర్పంచ్ అభ్యర్థుల రెండవ రోజైన సోమవారం పోటా పోటీలుగా నామినేషన్లు దాకలు చేశారు. కూటమి బలపరిచిన సర్ప ంచి అభ్యర్థి నీలావతి తెలుగు దేశం మాజీ ఎంపీ గునిపాటి రామయ్య కుమారుడు కిరణ్ కుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు, ప్రముఖ టి.డి.పి నాయకులు కల్లా చలపతి, చంద్రమోహన్‌ల ఆధ్వర్యంలో నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ నాయకులు గుత్తి రెడ్డి హరినా దరెడ్డి, తల్లెం రమణ రెడ్డిలు సర్పంచ్ అభ్యర్థిని గెలిపించు కోనేందుకు గట్టి పట్టుపట్టారు. సోమవారం నామినేషన్ల సందర్భంగా జనాల కోలాహలం అభ్యర్థులకు ఆనందాన్ని, ప్రజలకు ఆశ్చర్యం కలిగించాయి.

చంద్రగిరి పట్టణ అధ్యక్షుడుగా విశిష్ట సేవలు



చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త:
చంద్రగిరి మండల పరిషత్ ఉపాధ్యక్షుడుగా సక్కూరు ధనంజయ రెడ్డి పేరు ప్రధానంగా వినబడు తున్నది. టిడిపి చంద్రగిరి పట్టణ అధ్యక్షుడుగా 2014 నుండి సుధీర ్ఘ కాలం పార్టీకి విశిష్ట సేవలందిస్తున్న ధనంజయ రెడ్డి పార్టీ కార్యక్రమాలను నిర్వహించడంలో అత్యంత సమర్థత కలిగివున్నారు. చంద్రగిరి పట్టణంలో పార్టీ ఆదేశించిన కార్యక్రమాలతో పాటు టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు, వర్ధంతి వేడుకలను, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్, ఎంఎల్ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్, పార్టీ మండల అధ్యక్షులు, వివిధ కమిటీల అధ్యక్షుల పుట్టిన రోజు వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో సక్కూరు ధనంజయ రెడ్డి ముందు వరుసలో నిలుస్తారు. అదేవిధంగా పార్టీ సభ్యత్వ నమోదులో సైతం మండల స్థాయిలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని కలిగివున్నారు. 2014 నుండి ఆనేక పర్యాయాలు ఎన్టీఆర్ వర్ధంతి, జయంతి వేడుకలలో రక్తదాన శిబిరాలను నిర్వహించిన ఘనత కలిగివున్నారు. ప్రస్తుతం బిసి మహిళ కోటాలో సరిత రమణమూర్తి ఎంపిపి అభ్యర్థిగా ప్రమాణం చేయనున్నారు. మండల కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నెలకొన్న టిడిపి - వైసిపి పోరులో సక్కూరు ధనంజయ రెడ్డి విజయం సాధించారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి మండల కేంద్రంలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యత కలిగివుండటంతో సక్కూరు ధనంజయ రెడ్డి ప్రతిపాధనకు వస్తున్నది. టిడిపి అధినాయకత్వం యువతకు అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో మండల కేంద్రంలో అన్నివిధాలుగా అందుబాటులో వుండే సక్కూరు ధనంజయ రెడ్డి వైస్ ఎంపిపి అభ్యర్థిగా తగిన నాయకుడుగా సర్వత్రా సూచిస్తున్నారు.

తిరుపతి డివిజన్

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు.




యర్రావారిపాలెం, నవంబరు 16 ప్రభాతవార్త:
స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా యర్రావారిపాలెం మండలంలోని నామినేషన్ కేంద్రాలను సీఐ తిమ్మయ్య సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన వసతులు, భద్రతా చర్యలను పరిశీలించారు.నామినేషన్ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివాకర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ లోకేష్, డిప్యూటీ ఎంపీడీవో పద్మరాణి, ఎస్‌బీ దస్తగిరి నామినేషన్ కేంద్రాలను సందర్శించారు.

సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

పులిచెర్ల, నవంబరు 16 ప్రభాతవార్త:
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణకు పులిచెర్ల మండలంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజశేఖర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు.మండలంలోని గ్రామ పంచాయతీలను ఐదు గ్రూపులుగా విభజించి నామినేషన్ కేంద్రాలను కేటాయించారు.మొదటి కేంద్రం: వెంకటదాసరపల్లి గ్రామంలోని సచివాలయంలో ఏర్పాటు చేశారు. ఐదు గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరిస్తారు. రెండో కేంద్రం: కల్లూరు సచివాలయంలో ఏర్పాటు చేశారు. కల్లూరు, చల్లవారిపల్లి, పాతపేట, పాలెం గ్రామ పంచాయతీల నామినేషన్లు స్వీకరిస్తారు మూడో కేంద్రం: కమ్మపల్లిలోని సచివాలయంలో ఏర్పాటు చేశారు. ఐదు గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరిస్తారు.నాలుగో కేంద్రం: పులిచెర్ల రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో ఏర్పాటు చేశారు. పులిచెర్ల, రెడ్డివారిపల్లి తదితర నాలుగు గ్రామ పంచాయతీల నామినేషన్లు స్వీకరిస్తారు.ఐదో కేంద్రం: రాయవారిపల్లిలోని సచివాలయంలో ఏర్పాటు చేశారు. ఐదు గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరిస్తారు.ఈ ఐదు కేంద్రాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

భూ వివాదాలకు చెక్ పెట్టేలా రీసర్వే

.. యర్రావారిపాలెంలో రీసర్వే వేగవంతం
.. భూ సమస్యల పరిష్కారానికి సువర్ణావకాశం : తహసీల్దార్ శ్రీదేవి



యర్రావారిపాలెం, నవంబరు 16 ప్రభాతవార్త:
భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, భూ వివాదాలకు చెక్ పెట్టేలా రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు మండల తహసిల్దార్ శ్రీ దేవి, మండల ఇన్చార్జి సర్వేయర్ షణ్ముఖ ప్రియా అన్నారు. భూములకు సంబంధించి కచ్చితమైన డిజిటల్ రికార్డుల రూపకల్పనే రీసర్వే ప్రధాన ఉద్దేశమని, యర్రావారిపాలెం మండలంలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల ఇన్‌చార్జి సర్వేయర్ షణ్ముఖ ప్రియా మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు మండల తాసిల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో రోవర్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాల సహాయంతో ప్రతి భూకమతానికి అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా కచ్చితమైన హద్దులు నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. పాత భూ రికార్డుల్లోని అక్షర దోషాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, వారసత్వ మార్పులకు సంబంధించిన లోపాలను సరిదిద్ది పారదర్శకమైన డిజిటల్ రికార్డులు రూపొందిస్తామని వివరించారు. రీసర్వే పారదర్శకంగా నిర్వహించేందుకు రైతుల ప్రత్యక్ష భాగస్వామ్యం ఎంతో కీలకమని అధికారులు సూచించారు. సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా పొలాల వద్ద హాజరై సిబ్బందికి సహకరించాలని కోరారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆధార్ కార్డు, పాత భూ రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. సర్వే బృందం రాకముందే పొలాల్లోని సర్వే రాళ్లు కనిపించేలా శుభ్రం చేసుకోవాలని సూచించారు. రైతులు సర్వే సమయంలో హాజరుకాకపోతే భవిష్యత్తులో పాస్ పుస్తకాల జారీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అధికారులకు అవసరమైన పత్రాలు అందించి, రీసర్వేలో భాగస్వాములు కావడం ద్వారా భూ సమస్యలు, సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్రీదేవి, సర్వేయర్ షణ్ముఖ ప్రియా కోరారు.

రొంపిచెర్లలో నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

మూడు కేంద్రాల్లో 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ

రొంపిచెర్ల, నవంబరు 16 ప్రభాతవార్త:
గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు రొంపిచెర్ల మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఎస్. మధుసూదన రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు మండలంలో మూడు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన సిబ్బందిని నియమించినట్లు సోమవారం వెల్లడించారు. ప్రతి కేంద్రానికి ఒక రిటర్నింగ్ అధికారి, ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఎనిమిది మంది సహాయక సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండలంలోని బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు, బొమ్మయ్యగారిపల్లె గ్రామాల నామినేషన్లు బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ భవనంలో, రొంపిచెర్ల, బోడిపాటివారిపల్లె, మోటుమల్లెల, గానుగచింత గ్రామాల నామినేషన్లు రొంపిచెర్ల పంచాయతీ భవనంలో, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె, చెంచమరెడ్డిగారిపల్లె, జాండ్లవారిపల్లె గ్రామాల నామినేషన్లు పెద్దమల్లెల స్వర్ణ గ్రామ భవనంలో స్వీకరించనున్నట్లు వివరించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ల సమయంలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో మధు సుదన్ రెడ్డి తెలిపారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు

వడమాలపేట, నవంబరు 16 ప్రభాతవార్త:



వడమాలపేట మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భవానీ శంకరదేవాలయంలో మహా లింగానికి పంచా మృత అభిషేకం నిర్వహించారు. చందన అలంకరణలో వేదమంత్రాలతో మహా లింగార్చన నిర్వహించారు. సదాశివ కోనలో భక్తులు జాలువారే జలపాతంలో కార్తీక స్నానాలు చేసి తడిబట్టలతో సదాశివుని సందర్శించారు. అప్పలా యగుంట చంద్రమౌళీశ్వర స్వామి, ఓబీఆర్ కండ్రిగ, వడమాల ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో మహాశివుని లింగానికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. మహిళలు ఆలయాల వద్ద ప్రమిదలతో నేతి దీపాలు వెలిగించి దీప దర్శనం చేసుకున్నారు. తులసి, నెల్లి, చెట్ల వద్ద పూజలు చేసి దీపాలు వెలిగించారు.

గ్రంథాలయోద్యమ ప్రముఖులకు ఘన నివాళి



సూళ్ళూరుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త: సూళ్ళూరుపేటశాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 3వ రోజు (సోమవారం) గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న మహనీయుల సంస్మరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పసపల చిరంజీవి ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత గ్రంథాలయోద్యమ పితామహుడు శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య గారి జీవిత విశేషాలను వివరిస్తూ, 1890లో కొంకుదురు గ్రామంలో జన్మించిన ఆయన కోస్తా ఆంధ్ర ప్రాంతంలో అనేక గ్రంథాలయాలను స్థాపించి, గ్రంథాలయ విశారద వంటి బిరుదులతో పాటు 1972లో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారని తెలిపారు. అనంతరం భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా॥ఎస్.ఆర్. రంగనాథన్ గారి సేవలను కొనియాడుతూ, ఆధునిక గ్రంథాలయ నిర్వహణకు శాస్త్రీయ దృక్పథాన్ని అందించి గ్రంథాలయ వృత్తికి గౌరవం తెచ్చారని, ఆయన స్ఫూర్తితో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తదుపరి మరో వక్త వెంకటరత్నం గ్రంథాలయ సేవామూర్తి పాతూరి నాగభూషణం నిస్వార్థ సేవలను స్మరించుకున్నారు. దాదాపు 40 సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం కార్యదర్శిగా, గ్రంథాలయ సర్వస్వం పత్రిక సంపాదకులుగా ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. గ్రంథాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, పల్లెపల్లెకు గ్రంథాలయ ఉద్యమాన్ని తీసుకెళ్లడం, గ్రంథాలయం ఒక జీవనది వంటి రచనల ద్వారా ఆయన పఠన సంస్కృతిని పెంపొందించారని, గ్రంథాలయాలను జ్ఞాన దేవాలయాలుగా పోషించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులు గ్రంథాలయోద్యమ నాయకుల గురించి ప్రసంగించి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వంకా శ్రీనివాసులు, పాఠకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిసెంబర్ 6న 28వ అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవం



సూళ్ళూరుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త: సూళ్ళూరుపేటలోని శ్రీ అయ్యప్ప స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ అయ్యన్ అయ్యప్ప స్వామికి జ్యోతుల గ్రామోత్సవం 18 మెట్లకు పడికట్ల పూజను డిసెంబర్ 6 తేదీన నిర్వహించినట్లు అయ్యప్ప భక్త బృందం వారు సోమవారం తెలిపారు. డిసెంబర్ ఆరో తేదీఆదివారం ఉదయం విగ్నేశ్వర పూజతో పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తామని తెలిపారు. స్వామివారికి నెయ్యి అభిషేకం, విద్యుత్ దీపాలంకరణలతో ప్రత్యేక శోభ, కేరళ చంద మేళం, మంగళ మేల వాయిద్యాలతో, భజనలతో అయ్యప్ప శరణ ఘోషలతో జ్యోతుల గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూళ్ళూరుపేటలోని షార్ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి 16 ద్రవ్యములతో అభిషేకం, నెయ్యి అభిషేకం జరుగుతుందని తెలిపారు. శ్రీ అయ్యప్ప స్వామి జ్యోతుల గ్రామోత్సవంలో పాల్గొనే మహిళా భక్తులు దీపములు చేత బూని కార్యక్రమంలో భాగస్వాములు కావాలని శ్రీ అయ్యప్ప స్వామి భక్త బృందం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి 28వ వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొల్లి లీలామోహన్ స్వామి, కె చంద్రమౌళి రెడ్డిస్వామి, లింగారెడ్డి సాయి ప్రదీప్ రెడ్డి, పాదర్తి రవీందర్ రెడ్డి స్వామి, జీవి సుబ్బారావు స్వామి, వి రమేష్ స్వామి, ఏకే రాజగోపాల్ స్వామి, చిలక మోహన్ కృష్ణ, దేవస్థాన అర్చకులు కార్తీక్ స్వామీలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అల్లాలకు పాల్పడే వారిపై చర్యలు : ఎస్సై



వెంకటగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త : రాబోయే పంచాయతీ ఎన్నికల్లో అల్లాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై ఖాదర్బాషా హెచ్చరించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల నామినేషన్లు, ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో పెట్లూరు గ్రామంలో పోలీసు అధికారులు పర్యటించి గ్రామస్తులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణాన్ని పాటించాలని, నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకూడదని సూచించారు. గ్రామంలో రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు పరస్పరం గొడవలు, ఘర్షణలకు పాల్పడరాదని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలు చేయరాదని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ప్రశాంతమైన వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు జరిగేలా గ్రామస్తులందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. శాంతియుత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

పాతకాల్వలో పంచాయతీ రాజకీయం

-ఏకగ్రీవం వెనుక రూ.25 లక్షల ఒప్పందమా? -వైసీపీ, కూటమి నేతల మధ్య కుదిరినట్లు ప్రచారం -పంచాయతీ అభివృద్ధి పేరుతో రాజకీయ సమన్వయం
-కూటమి అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డికి ఏకగ్రీవ మద్దతు?
-తెరవెనుక చర్చలపై గ్రామంలో ఆసక్తికరమైన చర్చ



తిరుపతి రూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ పాతకాల్వలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల బరిలో ప్రత్యర్థులుగా నిలవాల్సిన వైఎస్సార్‌సీపీ, కూటమి వర్గాలు ఒక్కటై ఏకగ్రీవ నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నాయన్న ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కూటమి అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డిని సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసేందుకు ఇరు పార్టీల మధ్య తెరవెనుక అవగాహన కుదిరినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. గ్రామంలో ఎన్నికల పోటీకి బదులుగా అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఇరు వర్గాల నాయకులు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో భాగంగా ఏకగ్రీవానికి సంబంధించి రూ.25 లక్షల మొత్తంతో ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ మొత్తం ఎవరు, ఎవరికి, ఏ రూపంలో చెల్లించాలనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై ఇరు పార్టీల నాయకుల నుంచి అధికారిక ధృవీకరణ కూడా వెలువడలేదు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు జనాభా ఆధారంగా రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు ప్రకటించిన నేపథ్యంలో పాతకాల్వలో జరుగుతున్న ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ప్రభుత్వ ప్రోత్సాహక నిధులు, ఇరు వర్గాల మధ్య ప్రచారంలో ఉన్న రూ.25 లక్షల ఒప్పందం రెండూ వేర్వేరు అంశాలా? లేక గ్రామాభివృద్ధి నిధుల వినియోగంపై ఏదైనా అవగాహన కుదిరిందా? అన్నది తేలాల్సి ఉంది.

రాజకీయ పోటీకి తెర...అభివృద్ధికి బాటనా?:

సాధారణంగా పంచాయతీ ఎన్నికలంటే గ్రామాల్లో పార్టీల మధ్య పోటీ, ప్రచారం, వర్గపోరు కనిపిస్తుంటాయి. కానీ పాతకాల్వలో మాత్రం వైసీపీ, కూటమి వర్గాలు పరస్పర అవగాహనతో ముందుకు కొత్తన్నాయన్న ప్రచారం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. పరమేశ్వర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు వైసీపీ వర్గాలు కూడా సహకరించనున్నాయన్న సమాచారం నిజమైతే, గ్రామ రాజకీయాల్లో ఇది ఆసక్తికర పరిణామమే అవుతుంది. అయితే ఏకగ్రీవం కావడం ఒక్కటే గ్రామాభివృద్ధికి కొలమానం కాదు. తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ఉండాలి. ఏకగ్రీవం ద్వారా వచ్చే ప్రభుత్వ ప్రోత్సాహకాలు సహా అందుబాటులో ఉన్న నిధులు పారదర్శకంగా వినియోగించేలా గ్రామసభలో నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజల నిర్ణయమే కీలకం!:

పాతకాల్వలో పరమేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవానికి సంబంధించి జరుగుతున్న చర్చలు ఎంతవరకు వాస్తవరూపం దాలుస్తాయన్నది నామినేషన్ల ప్రక్రియతో స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఇరు పార్టీల నాయకుల మధ్య కుదిరినట్లు ప్రచారంలో ఉన్న రూ.25 లక్షల ఒప్పందం నిజానిజాలు, దాని వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటన్నది అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ఏకగ్రీవం పేరుతో ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలగకుండా, గ్రామ ప్రజలందరి ఆమోదంతో నిర్ణయం జరగడం అత్యంత ముఖ్యం.

శ్రీశైలం దేవస్థానానికి 10 టన్నుల కూరగాయలు వితరణ



పలమనేరు,నవంబర్ 16 ప్రభాతవార్త: పలమనేరు మార్కెట్ యార్డు నుండి శ్రీశైలం దేవస్థానానికి 10 టన్నుల కూరగాయలు వితరణగా పంపారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో ఈ మేరకు వాహనానికి పూజలు చేసి వివిధ రకాల కూరగాయలు నింపారు . దాతలు కొండారెడ్డి రవీందర్ రెడ్డి పలువురు మార్కెట్ కమిటీ ఏజెంట్లు వ్యాపారులు తమకు తోచిన విధంగా కూరగాయలు అందజేశారు. ఈ కూరగాయలు శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో అన్నదాన సత్రానికి అందజేస్తారు. ఈ సందర్భంగా ఓం నమశ్శివాయ అంటూ నినాదాలు చేశారు. దాతలు మాట్లాడుతూ కార్తీక మాసం మొదటి సోమవారం స్వామివారికి విశిష్టమైనదని ఇందులో భాగంగా కూరగాయలు పంపడం తమ పూర్వజన్మ సుకృతమని వివరించారు . గత నెలలోనూ ఇదేవిధంగా కూరగాయలు శ్రీశైలం దేవస్థానానికి పంపామని అలాగే వచ్చే నెలలో మూడో ప్రభాతవార్తసారి కూడా కూరగాయలు పంపుతున్నట్లు తెలిపారు.

ఉత్తరపుకండ్రిగలో వైసిపికి షాక్



పుత్తూరు, నవంబరు 16 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలోని పుత్తూరు మండలం ఉత్తరపుకండ్రిగ పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. పంచాయతీలో గోవిందప్పనాయుడు కండ్రిగ గ్రామంలో వైసిపికి చెందిన నర్రా రవిబాబునాయుడు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎంపిపి అభ్యర్థి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ గంజి మాధవయ్య టిడిపి కండువా కప్పి రవిబాబును పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ విభాగం అధ్యక్షుడు అరవ బాలాజీ, ఉత్తరపుకండ్రిగ ఎంపిటిసి అరవ ప్రకాశ్, నాయకులు రాఘవులుమందడి, యువరాజ్, కిషోర్, వరదయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కాశీవిశ్వేశ్వరాలయంలో విశేష పూజలు

రామకుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

స్థానిక శ్రీ అన్నపూర్ణాంబ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం విశేష పూజలు జరిపారు. స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలాగే స్థానిక నక్షత్రవనంలో కోటి దీపోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో చేరుకుని దీపాలు వెలిగించారు. నక్షత్రవనం ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

కార్తీక మాసం కోటి సోమవారం ... భక్తులతో పోటెత్తిన ముక్కోటి



చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త: ప్రముఖ శైవక్షేత్రం ముక్కోటి అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయం పవిత్ర కార్తీక మాసం కోటి సోమవారంను పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. ముక్కోటి అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం స్వామి పర్యవేక్షణలో అర్చకులు హేమంత్, ఉమాశంకర్ వేకువజామున స్వామి వారికి అభిషేకాధి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అగస్త్యేశ్వర స్వామి ఆనంద వల్లీ అమ్మవారిని విశేష అలంకృతులను గావించి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి ముక్కోటి ఆలయ సర్వాతోముఖాభివృద్ధికి కంకణబద్ధులై నిర్విరామ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో సమూల ప్రక్షాళనలతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. కార్తీక మాసం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్తీక పౌర్ణమి హరిహరులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం ప్రత్యేకతను సంతరించుకున్నట్లు వేదాలు, పురాణాల ద్వారా వెళ్ళడి అవుతున్నది. పరమశేశ్వరుడికి, మహావిష్ణువుకు ఇష్టమైన మాసం కావడంతో ఆ ఇద్దరిని కొలిచి తరించడం ద్వారా వారి శుభ అనుగ్రహం పొందడానికి తగిన మాసంగా ప్రాశస్త్యం కలిగివున్నది. ఈ మాసంలో శివాలయాలలో రుద్రాభిషేకం చేయించడం వలన సకల శుభాలు కలుగుతాయనీ, సిరి సంపదలు దరిచేరుతాయని పురాణాలు వివరిస్తున్నాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయ ఆవరణలో ధీపారాధనలు గావించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఉదయం 8 గంటలకు శ్రీ సిద్ధి బుద్ధి వినాయక స్వామి వారు మూషిక వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.


మీ సేవలు అమోఘం: ఉద్యానవన డిప్యూటీ డైరెక్టర్‌కు సన్మానం



తిరుమల,నవంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి: ప్రతి ఏటా శ్రవణనక్షత్రాన ఆలయంలో జరిపించే శ్రీవారి పుష్పయాగానికి దాతల నుండి పుష్పాలు సేకరించేందుకు కృషి చేసిన టిటిడి ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. విజయవంతంగా పుష్పయాగం నిర్వహించేం దుకు తొలినుండి కృషి చేసిన ఆయన్ను టిటిడి సాధికారిక మండలి చైర్మన్ ,ఈఒముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఒసి.హెచ్.వెంకయ్య చౌదరి ,సివిఎస్ఓ మురళీకృష్ణ దుశ్శాలువతో ఆత్మీయంగా సన్మానించారు. ఆయన సేవలను అభినందించారు.

సూళ్ళూరుపేట డివిజన్

సూళ్లూరుపేటలో...కోటి సోమవార పూజలు



సూళ్లూరుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో కోటి సోమవార పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించారు. శ్రీ నాగేశ్వర స్వామికి చేసిన ప్రత్యేక పుష్పాలంకారం భక్తులను అలరించింది. అలాగే అభయ శంకర దేవస్థానంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. భారీ అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, ప్రధాన అర్చకులు పేటేటి సునీల్ కుమార్ శర్మ, అభయ శంకర దేవస్థానంలో ఏఏంసి చైర్మన్ ఆకుతోట రమేష్ పర్యవేక్షణలో అర్చకులు రమణయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన



సూళ్లూరుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సోమవారం అధికారులు పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలైన కెసిఎన్ గుంట, కోటపోలూరు, మంగళంపాడు పంచాయతీ భవనాలను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో భద్రత ఏర్పాట్లు ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శైల కుమారి, సీఐ ఎం మురళీకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్య చర్యలు



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని న్యాయవాది హేమ గాంధీ తెలిపారు. పట్టణంలోని తోలుమెట్ట ప్రాథమిక పాఠశాలలో సురక్షిత బాల్యం బాలల సంరక్షణ ఉద్యమం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. బాలికలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు దర్శనం ఇచ్చిన... అయ్యప్ప స్వామి



వెంకటగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త: మల్లమ్మగుడి వీధిలో వెలసి ఉన్న ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కోటి సోమ వారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలాధారణలో ఉన్న భక్తులు అయ్యప్ప పాటలు పాడి పూజ చేశారు. అయ్యప్ప స్వామికి కుంకుమ అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

అర్ధనారీశ్వర సన్నిధిలో శివభక్తి పారవశ్యం



తొట్టంబేడు, నవంబర్ 16 ప్రభాతవార్త: కార్తీక మాసం వచ్చిందంటేనే శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం భక్తి సాగరంలో మునిగిపోతుంది. అందులోనూ మొదటి కార్తీక సోమవారం అంటే ఆ భక్తికి హద్దే ఉండదు. సోమవారం తెల్లవారుజాము నుంచే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న అర్ధనారీశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శివపార్వతులు ఒక్కటైన అర్ధనారీశ్వర తత్వం... భక్తులకు అదో ప్రత్యేక అనుభూతి. శివుడూ, శక్తీ ఒకే రూపంలో దర్శనమిచ్చే ఈ సన్నిధిలో కార్తీక సోమవారం పూజలు అంటే మాటలు కాదు. పంచామృ తాలతో అభిషేక వైభవం ఉదయం నుంచే అర్చకులు స్వామివారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకాలు ప్రారంభించారు. పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, పంచామృతం, తేనె, సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆ అలంకరణ చూస్తే కళ్లు తిప్పుకోలేనంత అందం. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్తీక సోమవారం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరూ ప్రసాదం స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

యోగులపర్వతంపై 24న కార్తీకదీపోత్సవం



తిరుపతి,నవంబర్ 16ప్రభాతవార్త: రామచంద్రపురం మండలంలోని యోగుల పర్వతంపై ఈనెల 24వతేదీ మంగళవారం కార్తీకదీపోత్సవం నిర్వహిస్తున్నారు.ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కార్తిక దీపోత్సవాన్ని కన్నుల పండుగ చేపడతారు. 1008 కిలోల ఆవు నెయ్యి,1503 మీటర్ల ఒత్తుతో 6 అడుగుల కొప్పెరతో కార్తీకదిపోత్సవాన్నీ వైభవంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఉదయం తిరుపతిలోని నేరేలమ్మ ఆలయం వద్ద భక్తులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కే ఎన్ రాజా, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, , విగ్రహాల కళ్యాణి, చిత్రపు హనుమంతరావు, కొలత్తూరు భాస్కర్ రెడ్డి, ఆర్ ఎం ఎస్ భాస్కర్, పురోహితుడు సురేష్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

17 CTR 5:17 CTR 5.qxd 11/16/2026 11:20 PM Page 1

సన్నబియ్యం పంపిణీ కేంద్రం ప్రారంభం



శాంతిపురం, నవంబర్ 16 ప్రభాతవార్త

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతిపురంలో సన్నబియ్యం పంపిణీ కేంద్రాన్ని తహశీల్దార్ ప్రకాష్‌బాబు ప్రారంభించారు. ప్రజలకు ధరణి రకం సన్నబియ్యం కిలో రూ 50లకే అందించడం జరుగుతుందన్నారు. అలాగే 26 కిలోల బస్తా రూ 1300లకు అందిస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీలర్ల సంఘ అధ్యక్షుడు చంద్ర, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

నేతలకు తలనొప్పిగా మారిన సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక

శాంతిపురం, నవంబర్ 16 ప్రభాతవార్త


మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక వ్యవహారం అధికార తెదేపా నేతలకు తలనొప్పిగా మారింది. సోమవారం అన్ని పంచాయతీల్లో దాదాపు నామినేషన్లు దాఖలయ్యాయి. మండల పరిధిలో ఒకటిరెండు పంచాయతీలు తప్ప మిగతా చోట్ల ఇద్దరు, ముగ్గురుమంది నామినేషన్లు వేస్తున్నారు.కొన్నిచోట్ల అధిష్టానం తమకు అవకాశం ఇచ్చినా ఇవ్వకపోయినా తాము ఎన్నికల బరిలో ఉ ంటామని కొందరు బహిరంగంగా పేర్కొంటున్నారు. దీంతో అధికార పార్టీలో సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారుతోంది. అయితే ప్రతిపక్ష పార్టీ తరపున చాపకింద నీరులా ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా నామినేషన్లు దాఖలుచేస్తున్నారు.

రామకుప్పంలో 239 నామినేషన్లు

రామకుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

మండలంలో సర్ప ంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు 239 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపిడిఓ అశ్విని తెలిపారు. సర్పంచ్‌లకు 66మంది, వార్డుస్థానాలకు 173మంది నామినేషన్లు వేశారు. రెండు రోజుల్లో మొత్తం 359 నామినేషన్లు దాఖలయ్యాయి.

శివనామ స్మరణతో మారు మ్రోగిన శివాలయాలు



చిట్వేలి, నవంబర్ 16 ప్రభాతవార్త:

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండల పరిధిలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మారు మ్రోగాయి. ఈ సోమవారం పుణ్యఫలమైన కోటి సోమవారం కావడంతో భక్తుల తాకిడి రెట్టింపు అయింది. స్థానిక శ్రీ భువనేశ్వరి శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు స్వామి అమ్మవారి దర్శనార్థం బారులు తీరారు. మహిళలు కార్తీకదీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సురేంద్ర శర్మ, పవన్ శర్మలు అమ్మవారిని వారాహి అమ్మవారి రూపంలో పసుపు కుంకుమ అలంకారాన్ని నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ పెద్దలు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా ఎండ్రకాయ రూపంలో సాక్షాత్కరించే పెద్దూరు సమీపంలోని గుండాల కోనకు తిరుపతి, ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ప్రజలు వేలాదిమంది వివిధ వాహనాలలో తరలివచ్చారు. ఆలయ పెద్దలు ప్రతి భక్తునికి స్వామివారినీ దర్శించే భాగ్యాన్ని కల్పించారు. స్థానిక శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో స్వామి అమ్మవారిని అర్చకులు మృత్యుంజయ విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుంపల్లి, నగిరిపాడు, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం తదితరచోట్ల విశేష పూజలు నిర్వహించారు. అన్నీ చోట్ల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్థానిక ఎస్సై వినోద్ కుమార్ తన సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారు.

ఎంపీ సీఎం రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన గునుపాటి కిరణ్ కుమార్ రాయల్...

ఓబులవారిపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త:

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని రైల్వే కోడూరులో అనకాపల్లి బిజెపి ఎంపీ సీఎం రమేష్ ను రాజంపేట తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీ గున్నిపాటి రామయ్య కుమారుడు గుడి కిరణ్ కుమార్ రాయల్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు రైల్వే కోడూరులో ఉన్న కొన్ని సమస్యలను పరిష్కరించాలని అలాగే తిరుపతి తాజ్ హోటల్లో అభివృద్ధికి తోడ్పాటు అందించాలని రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితి ఎన్నికల పరిస్థితిని వివరించారు. అన్ని విధాల సానుకూలంగా ఆయన స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు మంగంపేట నాయకులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లి మండలంలో 100 సర్పంచుల అభ్యర్థుల నామినేషన్లు

వార్డు మెంబర్లకు 212 నామినేషన్లు

ఓబులవారిపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా రైల్వే కోడ్ నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలంలో ఉన్నటువంటి 22 పంచాయతీలకు దాదాపు గ్రామపంచాయతీ సర్పంచుల కు సంబంధించి 100నామినేషన్లు వార్డు మెంబర్లకు సంబంధించి 212 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు. ఓబులవారిపల్లి ప్రధానంగా 12 నామినేషన్లు సర్పంచులకు దాఖలైనట్లు తెలుస్తోంది. అలాగే మంగంపేట, ముక్క వారి పల్లి చిన్న ఊరుంపాడు సర్పంచ్ అభ్యర్థులు నాగినేని పిచ్చయ్య. బుర్ర సుబ్బరాయుడు నామినేషన్ దాఖలు మంగంపేట బత్తల నేలవేణి. పోకూరు సుజాత. చిన్నరాజుపాడు కీర్తిపాటి అపరజత తదితర పంచాయతీలలో దాదాపు 85 నామినేషన్లు పూర్తయినట్లు సమాచారం. ఓబులవారిపల్లి ఎస్సై సృజన్ కుమార్ పోలీస్ సిబ్బందితో పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు.

రైల్వే కోడూరు సర్పంచ్ అభ్యర్థిగా భీమతి నామినేషన్ దాఖలు

రైల్వే కోడూరు రూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త

రైల్వేకోడూరు సర్పంచ్ అభ్యర్థిగా సోమవారం రైల్వేకోడూరు మలిశెట్టి దీమతి నామినేషన్ దాఖలు చేశారు. రైల్వేకోడూరు మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా కూటమి నాయకులతో పంచాయతీ ఆఫీసుకు వెళ్లి నామినేషన్ను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, పటాన్ మోలా తోపాటు కూటమికి చెందిన అగ్ర నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ చైర్మన్ ఏళుమలైకి సన్మానం

పుత్తూరురూరల్, నవంబరు 16 ప్రభాతవార్త:



పుత్తూరులోని భాస్కర్‌రాజు స్మృతి భవనంలో మున్సిపాలిటీ చైర్మన్ ఏళుమలై సన్మాన సభకు ఆయన అధ్యక్షత వహిస్తూ ఏళుమలై విజయం వెనుక స్వర్గీయ భాస్కర్‌రాజు, ఆత్మ ఆశీస్సులు బలంగాపని చేశాయని ఆయన అన్నారు. రాజకీయ నాయకులుగా వివిధపదవుల్లో ఏళుమలై పుత్తూరు పంచాయతీకి, మండలానికి చేసిన సేవలను పలువురు వక్తలు గుర్తు చేసుకున్నారు. పుత్తూరు మున్సిపాలిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఏళుమలైని, 30వ వార్డు కౌన్సిలర్ జీవరత్నంనాయుడుని ఘనంగా సన్మానించారు. సంఘఅభివృద్ధికి పదివేలు వల్లియమ్మ విశ్రాంత ఉపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు నారాయణబాబు, శ్రీధర్‌రాజు, సభ్యులు కుప్పయ్య, రామలింగం, యుగంధర్‌రాజు, వెంకటరమణ, నారాయణరెడ్డి, మురళి, కృపావరమ్మ, రవిశంకర్, అరుణాచలం, వెంకటకృష్ణమ నాయుడు, సిద్ధయ్య, రామచంద్రరాజు, రామమూర్తిరాజు, కుమారవేలు, సీతమ్మ, చారుమతి పాల్గొన్నారు.

సూర్యనారాయణరెడ్డికి మరో గుర్తింపు

జాతీయ రహదారి భద్రత మండలి సభ్యునిగా నియామకం



తిరుపతి,నవంబర్ 16ప్రభాతవార్త: తిరుపతికి చెందిన పారిశ్రామిక , సామాజిక వేత్త మబ్బు సూర్యనారా యణరెడ్డికి జాతీయ రహదారి భద్ర త మండలి సభ్యునిగా అవకాశం లభించింది. రహదారి ప్రమాదాల నివారణ, ప్రమాదాల విశ్లేషణ, రహదారి భద్రతా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాల్లో జాతీయ స్థాయిలో విధానపరమైన సూచనలు అందించే అత్యున్నత సలహా మండలిలో తిరుపతి ప్రాంతానికి ప్రాతినిధ్యం లభించడం విశేషం.జాతీయ రహదారి భద్రత మండలి సభ్యుడిగా మబ్బు సూర్యనారాయణ రెడ్డి నియామకమయ్యారు.ఈసందర్భంగా సోమవారం తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ , సీనియర్ మోటార్ వాహన తనిఖీ అధికారి సుబ్రహ్మణ్యం ,మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, స్వర్ణలత, ప్రసాద్ వర్మ, పరిపాలన అధికారులు విజయ్ కుమార్, విజయ ప్రశాంతి, రవాణా శాఖ సిబ్బంది పాల్గొని మబ్బు సూర్యనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్వేషణ 2026లో

పద్మావతి వర్సిటీ విద్యార్థినులకు బహుమతి



తిరుపతి,నవంబర్ 16ప్రభాతవార్త: అన్వేషణ-2026 విద్యార్థుల పరిశోధనా సదస్సులో పద్మావతి మహిళ వర్సిటీ బయోసైన్సెస్ సెరికల్చర్ విద్యార్థినులు ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సదస్సులో విశేష ప్రతిభ కనబరిచి, బేసిక్ సైన్సెస్ విభాగంలో ద్వితీయ బహుమతిని సాధించి విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్ఠలను తీసుకువచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ పరిశోధనా సదస్సు జరిగింది. ఈ పోటీలలో ఐశ్వర్య, ప్రసన్న, పూజ ,ఎస్.కె. రజీఫ్ తమ వినూత్న పరిశోధనా ఆవిష్కరణ బయోడిగ్రేడబుల్ మల్టీఫంక్షనల్ మల్చ్" కు ద్వితీయ బహుమతిని సాధించారు.
ఈ ఆవిష్కరణ పర్యావరణహిత వ్యవసాయ పరిష్కారంగా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండి నేలలో తేమను కాపాడటం, కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించడం, నేల ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడం , సంప్రదాయ ప్లాస్టిక్ మల్చ్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో దోహదపడుతుంది.. అంతేగాకుండా ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే పర్యావరణ సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుంది.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమా, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.ఉష, రీసెర్చ్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య వాణి, అన్వేషణ 26 యూనివర్సిటీ లెవెల్ కోఆర్డినేటర్లు ఆచార్య జాన్ సుష్మా, డాక్టర్ ఇందిర , సీరికల్చర్ అధ్యాపకులు, విద్యార్థులను అభినందించి, వారి విజయాన్ని ప్రశంసించారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు షెడ్యూల్ ఖరారు.

రేణిగుంట, నవంబర్ 16, ప్రభాతవార్త: రేణిగుంట మండల పరిషత్‌లో కోఆప్షన్ సభ్యుడి ఎన్నికతో పాటు మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ మేరకు ఈ నెల 19వ తేదీన ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారులు ప్రకటించారు.విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 19వ తేదీ ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ల పరిశీలన చేపడతారు. అనంతరం చెల్లుబాటైన నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల పేర్లను మధ్యాహ్నం 12 గంటలలోపు నోటీసు బోర్డులో ప్రకటిస్తారు.మధ్యాహ్నం ఒంటి గంటలోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. అనంతరం కోఆప్షన్ సభ్యుడి ఎన్నికకు సంబంధించిన ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రక్రియ చేపడతారు. ఎన్నికల ఫలితాలను ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రకటిస్తారు.అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారి సోమవారం ప్రకటన విడుదల చేశారు.

పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకే సర్పంచ్‌గా నామినేషన్ వేశా

రేణిగుంట, నవంబర్ 16, ప్రభాతవార్త:



జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకే రేణిగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసినట్లు మాజీ శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇన్‌చార్జి కోట వినుత మాతృమూర్తి నగరం జయలలిత స్పష్టం చేశారు. సోమవారం ఉదయం నగరం వినుతతో కలిసి అనుచరులు, మద్దతుదారులతో ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆమె సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకే తాను సర్పంచ్ స్థానానికి పోటీ చేయాలని నిర్ణయించుకుని నామినేషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ తరపున మరో అభ్యర్థిని సర్పంచ్ స్థానానికి బరిలోకి దింపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసిందని విలేకరులు ప్రశ్నించగా, అటువంటిదేమీ లేదని ఆమె సమాధానమిచ్చారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం

గ్రంథాలయాల చైర్మన్...



రేణిగుంట, నవంబర్ 16, ప్రభాతవార్త:

రేణిగుంట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి సోమవారం సందర్శించారు. వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు గ్రంథాలయ పితామహులైన ఎస్.ఆర్. రంగనాథన్, వెంకట్రావు, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాలు సమాజంలో విజ్ఞానాన్ని, చైతన్యాన్ని పెంపొందించి ఉత్తమ సమాజ నిర్మాణానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 20న వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగరాణి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నడ్డి నారాయణ, మునిలక్ష్మి, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త:

గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చంద్రగిరి బైపాస్ వద్ద చోటు చేసుకున్నది. పూతలపట్టునాయుడుపేట జాతీయ రహదారిపై రోడ్డు దాటు తున్న సుమారు 45 ఏళ్ళ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా మృతదేహంపై పలు వాహనాలు వెళ్ళడంతో శరీరం ఛిద్రమయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

తిరుపతి డివిజన్

కొలువుల బాట పట్టేలా విద్యార్థినులకు దిశానిర్దేశం

పోటీ పరీక్షలు, ఉద్యోగ నైపుణ్యాలపై అవగాహన



తిరుపతి విద్య, నవంబర్ 16 ప్రభాత వార్త

డిగ్రీ చదువుతున్న విద్యార్థినులు ఇప్పటి నుంచే తమ కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకుని, ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె. సాయికుమారి సూచించారు. చదువు పూర్తయ్యాక అవకాశాల కోసం ఎదురుచూడకుండా కళాశాల దశ నుంచే పోటీ పరీక్షలు, ఉద్యోగాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సెట్విన్, కౌటిల్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమారి మాట్లాడుతూ మొబైల్ ఫోన్లను వినోదానికి మాత్రమే పరిమితం చేయకుండా ఉద్యోగ సమాచారం, నైపుణ్యాల అభివృద్ధి, కెరీర్ ప్రణాళిక కోసం వినియోగించుకోవాలని సూచించారు.సెట్విన్ తిరుపతి మేనేజర్ మోహన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినిలోనూ ప్రత్యేక ప్రతిభ, సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి మెరుగుపరుచుకుంటే మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఉద్యోగ సాధనలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సానుకూల దృక్పథం, విలువలతో కూడిన ఆలోచనా విధానం కీలకమని వివరించారు.కౌటిల్య సంస్థ సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్. రెడ్డి మాట్లాడుతూ గ్రూప్1, గ్రూప్2తో పాటు ఎస్‌బీఐ, ఆర్‌బీఐ, ఐబీపీఎస్ వంటి బ్యాంకింగ్ ఉద్యోగాలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా సిలబస్‌పై పట్టు సాధించాలని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏపీపీఎస్సీ, టీపీఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కృత్రిమ మేధస్సును చదువు, పోటీ పరీక్షల సన్నద్ధతకు ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.తెలుగు విభాగాధిపతి డా. బి. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థినులు తమ ఆసక్తి, అర్హతలకు అనుగుణంగా కెరీర్‌ను ఎంచుకోవడానికి ఈ కార్యక్రమం మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డా. ఎల్. కస్తూరి, డా. బి. ఉమామహేశ్వరి, డా. కె. విజయకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో ఎస్‌పీడబ్ల్యూ విద్యార్థినుల రాష్ట్రస్థాయి దూకుడు

జిల్లా పోటీల్లో సత్తా.. ఆరుగురికి రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం



తిరుపతి విద్య, నవంబర్ 16 ప్రభాత వార్త

ఫుట్‌బాల్ మైదానంలో ప్రతిభ, పట్టుదలతో రాణించిన శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 19 ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో విజయం సాధించి తదుపరి దశకు అర్హత పొందారు. నవంబర్ 21 నుంచి 23 వరకు పుత్తూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తిరుపతి జిల్లా తరఫున తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.జిల్లా స్థాయి పోటీల్లో కళాశాల విద్యార్థినులు కనబరిచిన క్రీడా నైపుణ్యం, సమష్టి కృషి రాష్ట్రస్థాయి అవకాశాన్ని తెచ్చిపెట్టాయి. ఒకే కళాశాల నుంచి ఆరుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషం. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థినులు ముందంజలో ఉండటం కళాశాల క్రీడా ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. సి. భువనేశ్వరి విద్యార్థినులను అభినందించారు. జిల్లా స్థాయిలో సాధించిన విజయంతో సంతృప్తి చెందకుండా రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రదర్శన కనబరచాలని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా వ్యక్తిగత ప్రతిభతో పాటు కళాశాల, టీటీడీకి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. అభినందన కార్యక్రమంలో పీడీ సాయి సమతి, అధ్యాపకులు పాల్గొని క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో ఇ. దేవిక (ద్వితీయ సంవత్సరం హెచ్ఈసీ), కె. శ్రీహర్ష (ద్వితీయ సంవత్సరం బైపీసీ), పి. అనూష (ప్రథమ సంవత్సరం బైపీసీ), యు. హారిక (ద్వితీయ సంవత్సరం ఎంఈసీ), ఎన్. హేమశ్రీ, జి. విష్ణుప్రియ (ద్వితీయ సంవత్సరం సీఈసీ) ఉన్నారు.

ఫుట్‌బాల్‌లో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విజయం


ట్రైబ్రేకర్స్‌లో 5-3తో ఎస్వీ ఇంజినీరింగ్‌పై గెలుపు



తిరుపతి విద్య, నవంబర్ 16 ప్రభాత వార్త

ఎస్వీ యూనివర్సిటీ అంతర్ కళాశాల పురుషుల క్రీడా పోటీల్లో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఫుట్‌బాల్ జట్టు విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల జట్టును ట్రైబ్రేకర్స్‌లో 5-3 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.ఎస్వీ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ డా. ఎస్. ముస్తాక్ అహ్మద్ పర్యవేక్షణలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 2026 అంతర్ కళాశాల పురుషుల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఎనిమిది కళాశాలల జట్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో నిర్ణీత సమయంలో విజేతను తేల్చలేకపోయారు. దీంతో ట్రైబ్రేకర్స్ నిర్వహించగా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల జట్టు పైచేయి సాధించింది.హాకీ పోటీల్లో ఎస్వీయూ కాలేజీ తిరుపతి జట్టు సత్తా చాటింది. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలతో జరిగిన పోరులో ట్రైబ్రేకర్స్‌లో 5-4 స్కోరుతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఎస్వీయూ కాలేజీ తిరుపతి జట్టు 2-1 గోల్స్ తేడాతో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలను ఓడించింది.పోటీల ప్రారంభోత్సవానికి దేవస్థానం ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ప్రొఫెసర్ శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. దేవస్థానం తరఫున నిర్వహిస్తున్న ఈ క్రీడా కార్యక్రమాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం విజేత జట్లకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. జి. కిషన్, ఎస్వీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. ఎం. శివశంకర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డా. ఎస్. ముస్తాక్ అహ్మద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. వై. మల్లికార్జున్, సీనియర్ అధ్యాపకులు డా. ఎం. కిరణ్ కుమార్ రాజు, డా. ప్రసాద్ రావు, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

కోటిసోమవారాన శివార్చన



తిరుపతి,నవంబర్ 16ప్రభాతవార్త కార్తీకమాసంలో మొదటి సోమవారం దామోదర నామంతో కోటి సోమవార శివార్చన జరిగింది. 365 ఒత్తులతో దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు చిత్రప హనుమంతరావు, తొండమనాడు సుబ్రహ్మణ్యం రెడ్డి, మల్లారవు రవిప్రసాద్ మల్లారప రవి ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి డివిజన్

పోటాపోటీగా నామినేషన్ల దాఖలు - ఛైర్మన్ బరిలో పలువురు ఆశావాహులు



శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల్లో అధికార ప్రతిపక్ష పార్టీలు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. ఛైర్మన్ అభ్యర్థికి టిడిపి, వైసిపి నుండి 7 నామినేషన్లు దాఖలు కాగా,కాంగ్రెస్ నుంచి 3, సిపిఎం-2 మొత్తం 19 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అటు టిడిపి నుంచి ఇటు వైసిపి నుంచి ఛైర్మన్ పదవి ఆశిసస్తున్న పలువురు ఆశావాహులు నామినేషన్లు దాఖలు చేయడంతో నామినేషన్ల పరిశీలన అనంతరం ఛైర్మన్ అభ్యర్థిని తుదిగా ఆయా పార్టీలు ఖరారు చేయనున్నాయి. టిడిపి నుంచి పేట బాలాజీరెడ్డి, వైసిపి నుంచి లక్ష్మీపతి ఛైర్మన్ అభ్యర్థులుగా పోటీపడనున్నట్లు సమాచారం. కాగా, వార్డు కౌన్సిలర్లకు 315 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ దఫా వార్డు కౌన్సిలర్ల పోటీకి ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్లు కూడా అధిక సంఖ్యలోనే రంగంలోకి దిగారు. తెలుగుదేశం పార్టీ నుంచి 101, జనసేన -24, బిజెపి-19, వైసిపి-140, కాంగ్రెస్-5, సిపిఎం-4, సిపిఐ-2, ఇండిపెండెంట్లు-21 మొత్తం-316 నామినేషన్లు దాఖలు చేశారు. వార్డు కౌన్సిలర్లకు తీవ్రపోటీ నెలకొంది. వార్డు కౌన్సిలర్లకు ఆయా పార్టీల్లో అభ్యర్థుల్లో పలువురు నామినేషన్లు వేయడం, తుదిగా పార్టీలో ఎవరికి ఖరారు చేస్తారో వేచి చూడాల్సిందే. చివరి రోజు పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో జరిగిన ఘర్షణల దృష్ట్యా మున్సిపల్ ఎనన్నికలకు నామినేషన్లు వేయడంపై నెలకొన్న సందేహాలు పటాపంచలయ్యాయి. పోలీస్ అధికారులు, అధికార యంత్రాంగం చేపట్టిన చర్యల ఫలితంగా అన్ని పార్టీల అభ్యర్థులు ఇండిపెండెంట్లు సైతం స్వేచ్ఛగా నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టంలో ఎటువంటి ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకోకపోవడంతో రాజకీయ వర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి.

పరిశీలనలో ఏమయ్యేనో:

మున్సిపాలిటీకి రికార్డు స్థాయిలో 335 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నామినేషన్లను మంగళవారం పరిశీలన జరగనున్నది. ఈ పరిశీలనలో ఎంత వరకు నామినేషన్లు నిలస్తాయో అన్నది కూడా చర్చసాగుతుంది. నామినేషన్ల పరిశీలన సజావుగా సాగి ప్రతిపక్షం దాఖలు చేసిన నామినేషన్లు ఆమోదం పొందుతాయా? లేదా అన్న శంఖ ప్రతిపక్ష పార్టీల్లో నెలకొంది. అయితే అధికారులు నామినేషన్ల పరిశీలి నిష్పక్షపాతంగా వ్యవహరించి విమర్శలకు తావివ్వకుండా వ్యవహరిస్తారన్న అభిప్రాయాలు సైతం నెలకొన్నాయి. అయితే నేడు ఏం జరుగుతుందో అని చూడాల్సిందే.

బండారుపల్లి సర్పంచ్ అభ్యర్థిగా బత్తెమ్మ నామినేషన్



ఏర్పేడు, నవంబర్ 16 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం పంచాయతీ ఎన్నికల సందర్భంగా బండారుపల్లి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఆర్.బత్తెమ్మ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి హాజరై నామినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న సర్పంచ్ అభ్యర్థులు కృష్ణవేణి, సూరి నాయుడు, పార్టీ నాయకులు సుధాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు ఆయనతో కలిసి పాల్గొన్నారు. బత్తెమ్మకు మద్దతుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, గ్రామస్తులు తరలివచ్చారు.

తొట్టంబేడులో 15 నామినేషన్లు దాఖలు



తొట్టంబేడు, నవంబర్ 16 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలో సర్పంచ్ పదవులకు సోమవారం రోజున మొత్తం 15 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో పి. సురేంద్ర తెలిపారు. ఈ మేరకు బసవయ్యపాలెంలో ఎం.రామ్మూర్తి, పి. శివకుమార్, టి.సాయికుమార్, పి.సురేష్, సి.జయమ్మ, కె.నాగరాజు సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. పెద్దకనపర్తి పంచాయతీ సర్పంచ్ పదవికి అంజూరు కృష్ణమూర్తి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. జనరల్ కేటగిరీకి చెందిన ఈ పంచాయతీకి ఇప్పటివరకు మొత్తం 01 నామినేషన్ దాఖలైనట్లు సమాచారం. కారాకొల్లులో జి.దిదీవ్య, చోడవరంలో కె.అశ్విని, ఎస్.అలేఖ్య, ఇలగనూరు సర్పంచ్‌గా పి.శైలజ, చిట్టతూరులో వై.గీతమ్మ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థులకు అండగా నిలిచారు.

శ్రీకాళహస్తీశ్వరాలయం...దీపాల మయం



శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక మాసం రెండవ సోమవారం దీపాల కాంతితో కళ కళ లాడింది. దేవస్థానం మహిళా భావాలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసారు. బిక్షాల గాలిగోపురం సమీపంలో కాశీవిధ్వనాధస్వామి ఆలయం సమీపంలో ఏర్పాట్లు చేసారు.అలాగే ఇక్కడ దీపాలు వెలిగించుటకు ప్రత్యేంగా పీటలు, దీపాలకు ఇనుక ప్రమీదలు ఏర్పాటు చేసారు. ఉదయం నుంచి ఇక్కడ మహిళలు దీపాలు వెలగిస్తూ కలనబడ్డారు. ఇక ఇక్కడ దీపాలు వెలిగించి వెళ్ళి తరువాత వెంటనే శుభ్రం చేయటానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసారు.భారీ ఎత్తున మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకండా ఆలయ ఇఒ బికె వెంకటేశులు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసారు.

ఆకాశదీపాన్ని వెలిగించిన ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి,నవంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాయలంలో నిర్వహిస్తున్న కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ఆకాశదీపాన్ని నెల రోజుల పాటు నిర్వహించటం ఆనవాయితి. సోమవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తమ పార్టీ నాయకులతో కలసి ఆకాశదీపాన్ని ఆవిష్కరించే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గతంలో కోటమండపం వద్ద ఏర్పాటు చేసే కార్యక్రమాలను ఈ ఏడాది విజయస్థంభం వద్ద ఏర్పాటు చేసారు. ఆకాశదీపాన్ని వెలిగించుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దంపతులు రాగా వారితో పాటు బోర్డు సభ్యుడు వాకచర్ల గుర్రరప్పశెట్టి, మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్,ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్, అర్చకులు అర్థగిరి,అవినాష్ శర్మ,గోవిందశర్మలు వేదమంత్రాలు పఠిస్తుండగా ఆకాశదీపాన్ని వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సజావుగా సాగేందుకు సహకరించాలి: సీఐ



రొంపిచెర్ల, నవంబర్ 16 ప్రభాతవార్త: మండలంలో అన్ని గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలకు తావులే కుండా, ప్రశాంత వాతా వరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కల్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. ప్రసాద్ రావు కోరారు. సోమవారం రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్. మధుసూదన్ రెడ్డితో కలిసి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జి. ప్రసాద్ రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నామినేషన్ల దాఖలు చేసే అభ్యర్థులు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు, రికార్డులతో నామినేషన్ కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో ఎస్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ కోసం అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో నిర్ణీత సమయపాలన పాటిస్తూ, అవసరమైన అన్ని ధ్రువపత్రాలు, సరైన రికార్డులతో కేంద్రాలకు రావాలని సూచించారు. ఈ సమావేశంలో రొంపిచెర్ల సబ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుచే...కార్తీక వనభోజనాలు



శ్రీకాళహస్తి నవంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో కార్తీక మాసం సందర్భంగా ధార్మిక కార్యక్రమాలు విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో కార్తీక మాసం సోమవారం కైలాసగిరుల్లోని భరద్వాతీర్థంలో శ్రీ సత్యవ్రత భాస్కర్‌క్షేత్ర అన్నదాన ట్రస్టుచే కార్తీక వనభోజనాల కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు.అన్నదాన ట్రస్టు ప్రతి ఏడాది కార్తీక మాసంలో శ్రీకాళహస్తిలో అవదూతగా ప్రఖ్యాతి గాంచిన శివశంకర వేణుగోపాల స్వామి ఆరాధనోత్సవాలను నిర్వహజంచటం ఆనవాయితి ఈ నేపధ్యంలో రెండవ సోమవారం స్వామి 49వ ఆరాధనోత్సవాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఉదయం నుంచి భారద్వాజేశ్వరాలయంలో పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం పట్టణానికి చెందిన ప్రముఖులు ప్రజలు హాజరు కాగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు ట్రస్టు అధ్యక్షుడు గరికపాటి రమేష్, మాజీ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్, చింతామణి పాండు,గరికపాటి దేవేంద్ర తదితరులు హాజరయ్యారు.

31 పతకాలతో...సత్తా చాటిన శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి,నవంబర్ 16 ప్రభాతవార్త: వయసు మీద పడిందని ఇంట్లో కూర్చోవాలా? లేదు... ట్రాక్ మీదకు దూకి పతకాలు కొట్టాలి అని నిరూపించారు శ్రీకాళహస్తి నిత్య ఫిట్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ అథ్లెట్లు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగిన 46వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో వీరు ఏకంగా 31 పతకాలు సాధించి తిరుపతి జిల్లాకు ఘన విజయాన్ని అందించారు. నిత్య ఫిట్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ అధినేతలు జ్యోతిరావు, రూపాదేవి ఆధ్వర్యంలో 19 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అందులో 8 మంది మహిళా క్రీడాకారిణులు ఏకంగా 20 పతకాలు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 11 మంది పురుష క్రీడాకారులు 11 పతకాలు కైవసం చేసుకున్నారు. ఒక్కొక్కరు రెండు నుంచి మూడు విభాగాల్లో పోటీపడి పతకాలు సాధించడం విశేషం. ఈ విజయంలో ప్రత్యేక ఆకర్షణ ఇన్‌స్టిట్యూట్ అధినేత జ్యోతిరావు. కేవలం కోచ్‌గా శిక్షణ ఇవ్వడమే కాదు, స్వయంగా ట్రాక్ మీదకు దిగి పతకం సాధించారు. కోచ్‌గా, క్రీడాకారుడిగా ఆయన చూపిన అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ సందర్భంగా మహిళా పతక విజేతలకు ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. పురుషుల విభాగంలో వెంకట రమణారెడ్డి, గోవిందరెడ్డి, శ్రీనివాస్, వినోద్, దివాకర్, జ్యోతిరావు.మహిళల విభాగంలో రూపాదేవి, మంజులాదేవి, హిమబిందు, కళ్యాణి రాణి, గోమతి, లావణ్య, జ్యోతి లను సన్మానించారు

దాడులు,దౌర్జన్యాలుతో...నామినేషన్ల పర్వంలో



తొట్టంబేడు, నవంబర్ 16 ప్రభాతవార్త: ఎన్నికలు అంటే ప్రజలు ఓటుతో తీర్పు ఇవ్వాలి. కానీ ఇక్కడ ఓటుకు బదులు రాళ్లు, చేతుల్లో నామినేషన్ పత్రాలకు బదులు చిరిగిన కాగితాలు మిగిలాయి. తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామంలో జరిగిన దారుణ ఘటన ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నిస్తోంది. రౌతు సూరమాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నాగరాజు నామినేషన్ దాఖలు చేయడానికి వెళుతున్న సమయంలో టీడీపీ మూకలు అడ్డగించి దాడి చేశారని వైసీపీ నాయకులు ఆరోపించారు. తలపై బలంగా కొట్టడంతో తల పగిలి రక్తం కారింది. అంతటితో ఆగకుండా ఆయన చేతిలో ఉన్న నామినేషన్ పత్రాలను లాక్కుని చింపివేశారు. ప్రజాస్వామ్య హక్కుతో నామినేషన్ వేయడానికి వెళ్తున్న అభ్యర్థిపై ఇలా దాడి చేయడం ఏంటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటన విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, అంజూరు తారక శ్రీనివాసులు సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన నాగరాజును మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తన కారులో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందేలా చర్యలు చేపట్టారు.

ఎన్నికల సంఘం స్పందించాలి : వైసీపీ డిమాండ్

ఈ ఘటనపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికలు భయంతో కాదు, ధైర్యంతో జరగాలని, ప్రతి అభ్యర్థికి రక్షణ కల్పించాలని కోరారు.

గుడిమల్లంలో పోటెత్తిన మహిళా జనం



ఏర్పేడు,నవంబర్ 16 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లం ఆలయం కార్తీక మసం రెండవ సోమవారం మహిళా భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయానికి మహిళా భక్తుల తాకిడిని గమనించిన ఛైర్మెన్ బత్తలగిరి నాయుడు ఉదయం నుంచి ఏర్పాట్లుతో తలమునకలయ్యారు. ఉదయం బత్తల గిరినాయుడుదంపతులు గోపూజలతో దర్శనాలకు అనుమతించారు. ఉదయం నుంచి దీపాలు వవెలిగించుటకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలంలో దీపాలను వెలిగించారు.కార్తీక మాసం శివాలయంలో దీపాలు వెలిగిస్తే మంచిదనే భావం మహిళా భక్తుల్లో ఉంది.ఈ మేరకు ఏర్పాట్లును చేపట్టారు. అంతేకాకుండా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఇక చ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలతో పాటు భోజన వసతి కల్పించారు.ఉదయం నుంచి ఆలయం పరిసరాలు దీపాల కాంతితో కళ కళ లాడింది. వచ్చిన మహిళా భక్తులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన వసతి కల్పించారు. ఏర్పాట్లును ఆలయ ఇఒ మునిశేఖర్ పర్యవేక్షించారు.

శివయ్య సేవలో నారారోహిత్ పూజలు



శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సేవలో సినీనటుడు నారా రోహిత్ ఆయన సతీమణి నారా శిరీష కుమారుడు నందనరామాలు పాల్గొన్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ బికె వెంకటేశులు ఆదేశాలతో ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. వారితో పాటు ఎంజిఎం అధినేత గుడ్లూరు మల్లికార్జున్ నాయుడు ఉన్నారు. ఆలయంలో పూజలు జరిపించుకున్న వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద నారారోహిత్ కుటుంబసభ్యులకు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వాఇమ అమ్మవార్ల చిత్రపటాలతో పాటు తీర్థ ప్రసాదాలను అందించారు. కాగా వారికి గుడ్లూరు మల్లికార్జున్ నాయుడు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలతో సత్కరించారు. స్వాగతం పలికిన వారిలో ట్రస్టుబోర్డు సభ్యులు లక్ష్మీనారాయణ కుమారుడు సందీప్, తిరుపతి జనసేన నాయకుడు పనుమాడు ప్రణీత్ ఉన్నారు.

కన్నుల పండువగా గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తులు సేవలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ నేపధ్యంలో రెండవ సోమవారం పెళ్ళకూరు మండలం చెంబెండు గ్రామానికి చెందిన శివభక్తులు స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.ఈ మేరకు దేవస్థానంకు సొమ్ములు చెల్లించి ఉభయం నిర్వహించాలని కోరారు. సోమవారం ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసి రుద్రాక్షల పల్లకిలో ప్రతిష్టించారు. గ్రామోత్సవంను ఆలయ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి, దఫేదార్ రాజాల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

నిత్యాన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరా లయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది.స్థానికులతో పాటు దేశంలోని నలుమూలల నుంచి వస్తున్న భక్తులు నిత్యాన్న ప్రసాదంలో భోజనం చేస్తే తప్పక విరాళాలు అందిస్తున్నారు.ఈ నేపధ్యంలో కార్తిక మాసం రెండవ సోమవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న పట్టణానికి చెందిన బి.మధు సూధన్, నీరజలు ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానానికి విరాళం అందివ్వాలని పిఆర్ఓ కార్యాలయంలోని రవికి సూచించారు. ఆయన వారిని ఇఒ బికె వవెంకటేశులు వద్దకు తీసుకెళ్ళగా వారికి పథకం ప్రాధాన్యతను ఇఒ వెంకటేశులు వివరించారు. దాంతో వారు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వారికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో పాటు వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నామినేషన్లు



శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నామినేషన్లు జరిగాయి. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డి ఆధ్వర్యంలో పలు వార్డులకు, చైర్మన్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రాబోయేవి మంచి రోజులని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని తెలిపారు.దామోదరంరెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘకాలం తర్వాత కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్లు వేయడం సంతోషకరమని అన్నారు. శ్రీకాళహస్తి పట్టణ ప్రజలంతా కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, షేక్ నిజాముద్దీన్ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు జ్యోతిశ్వర్ నాయక్, జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రేమ సుందరం, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాయాదవ్, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.

45 రోజుల దీక్షతో వెలిగే కోటి దీపాలు



తొట్టంబేడు నవంబర్ 16 ప్రభాతవార్త: కేవలం పూజ మాత్రమే కాదు, ఇది 45 రోజుల నిరంతర సంకల్పం. శ్రీఅర్ధనారీశ్వర భక్త బృందం చేపట్టిన దీక్ష ఇప్పుడు కోటి దీపోత్సవంగా మారింది. ఈ నెల 15 నుంచి 24వ తేదీ పౌర్ణమి వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు అఖండంగా దీపాలు వెలగనున్నాయి. భక్తులు తమ కోరికలు, కష్టాలు, బాధలను మాటల్లో చెప్పలేని చోట దీపంలో విన్నవిస్తున్నారు. ఒక్కో దీపం ఒక్కో మొక్కు. ఒక్కో వెలుగు ఒక్కో ఆశ. అందుకే ఈ దీపోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా భక్తి ఉద్యమంగా భావిస్తున్నారు నిర్వాహకులు గంగాధరం. ఈ దీక్ష వెనుక ఉన్న ప్రధాన సంకల్పం ధర్మం కోసం, న్యాయం కోసం చేస్తున్న పోరాటానికి స్వామివారి ఆశీస్సులు పొందడమేనని భక్త బృందం చెబుతోంది. అర్ధనారీశ్వరుని సన్నిధిలో చేసే ఈ దీపారాధన భక్తులకు మనోధైర్యాన్ని, సానుకూల శక్తిని ఇస్తుందని అంటున్నారు. ఈ పవిత్ర దీపోత్సవంలో భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని శ్రీ అర్ధనారీశ్వర భక్త బృందం ఆహ్వానిస్తోంది.